



పాములపాడు మండలం రుద్రవరం గ్రామంలో నేలవాలిన వరిపైరు

పాములపాడు: ఆరుగాలం కష్టపడి పంటలు సాగుచేస్తే తుఫాన్ కారణంగా చేతికొచ్చిన పంట కళ్ళెదుటే నేలవాలుతోంది. పాములపాడు మండలంలో మూడు రోజులుగా మేఘాలు ముసురుకొని చిరుజల్లుల నుంచి మోస్తరుగా వర్షాలు, ఈదురు గాలులు వీస్తున్నాయి. దీంతో కోతలకు సిద్ధంగా ఉన్న వరి పంటలు వందల ఎకరాల్లో నేలవాలాయి. కేసీ ఆయకట్టు కింద ఖరీఫ్‌లో సాగు చేసిన రైతులు భారీగా నష్టపోయారు. ఎకరాకు రూ.20వేలు పెట్టుబడులు పెట్టినా నష్టపోవాల్సి వచ్చిందని రైతులు కన్నీటిపర్యంతమయ్యారు.

కన్నీటి పంట



- ఫెంగల్ తుఫాన్ తెచ్చిన నష్టం
- పలు ప్రాంతాల్లో జోరువాన
- తడిసిన వరి ధాన్యం
- పొలాల్లోనే నేలవాలిన పైరు
- రైతులకు అపార నష్టం



ఫెంగల్ తుఫాన్ రైతులను నిండా ముంచేసింది. ఆరుగాలం కష్టపడి పంటను కాపాడుకుంటూ వచ్చిన వరి రైతు కష్టం నీటిపాలైంది. నంద్యాల జిల్లాలో ప్రభావం ఫెంగల్ తుఫాన్ తీరని నష్టాన్ని మిగిల్చింది. జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో వరిపంట పూర్తిగా తడిసిపోగా, మరికొన్నిచోట్ల కోతకు వచ్చిన పంట నేలవాలి పనికిరాకుండా పోయింది. వడ్డీలకు తెచ్చి పెట్టిన పెట్టుబడులు వర్షానికి కొట్టుకుపోయాయి. నూర్పిడి చేసి కల్లాల్లో దాచిన ధాన్యం, రోడ్డుపై ఆరబోసిన వడ్లు మొత్తం తడిసి ముద్దయ్యాయి. దీంతో అన్నదాతలు కన్నీటిపర్యంతమవుతున్నారు.



ఉయ్యాలవాడ మండలంలో..



చాగలమర్రిలో తడిసిన వరి ధాన్యం బస్తాలను తరలిస్తున్న రైతులు

రైతుల్లో ఆందోళన



రుద్రవరం మండలం చిన్నకంబలూరు పంట పొలాల్లో తడిసిన ధాన్యం

చాగలమర్రి/రుద్రవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ ప్రభావం జిల్లాపై పడింది. చాగలమర్రి, రుద్రవరంలో బుధవారం జోరు వాన కురిసింది. దీంతో రైతులు ఆరబోసిన వరి ధాన్యం తడిసిపోయింది. చాగలమర్రి మండలంలోని శెట్టివీడు, చింతలచెరువు, ముత్యాలపాడు తదితర గ్రామాల్లో ఆరబెట్టుకున్న వరి ధాన్యం వర్షానికి తడిసి రైతులు నష్టపోయారు. పట్టలపై నిలిచిన వర్షపు నీటిని తొలగించేందుకు రైతులు అవస్థలు పడ్డారు. శెట్టివీడు గ్రామ రహదారిలో తేమతో ఉన్న వరి ధాన్యాన్ని రైతులు బస్తాలతో వర్షంలోనే తరలించారు. కొందరు రైతులు టార్పాలిన్ పట్టలను కప్పుకుంటూ ధాన్యం కాపాడుకునేందుకు అవస్థలు పడ్డారు. మరికొన్ని గ్రామాల్లో పొలాల్లోని వరిపంట నేలవాలి దెబ్బతింది. తడిసిన ధాన్యం కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదని రైతులు విలపిస్తున్నారు. ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేసి ఆదుకోవాలని కోరుతున్నారు. రుద్రవరం మండలంలో మూడురోజుల నుంచి తుఫాన్ రైతులను ఉక్కిరిబిక్కిరి చేసింది. కొండమాయపల్లె నుంచి కోటకొండ వరకు గ్రామాలు మినహా 14 కిలోమీటర్ల రహదారి వెంట ధాన్యం కుప్పలే ఉన్నాయి. అలాగే నరసాపురం నుంచి నల్లవాగుపల్లె మెట్ట వరకు సుమారు 3 కిలోమీటర్లు ధాన్యం కుప్పలు తడిసిపోయాయి. పొలాల్లోని ధాన్యం కుప్పలను ఒడ్డుకు తెచ్చేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

పాణ్యం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పాణ్యం మండలంలో ఈ ఏడాది ఆరువేల హెక్టార్లలో వరి సాగు చేశారు. ఎకరాకు రూ.30వేలు పెట్టుబడితో వేసిన పంట చేతికొచ్చే సమయంలో తుఫాన్ దెబ్బతో పంట విక్రయంపై సందిగ్ధత ఏర్పడింది. పంటకోత సమయంలో తుఫాన్ రావడంతో రైతులు కుదేలయ్యారు. కొందరు రైతులు ముందుగా కోత కోసి ఇళ్లకు తీసుకెళ్లారు. అయినా 4వేల హెక్టార్ల పంట ఇంకా చేలల్లోనే ఉండిపోయింది. కోతకు సిద్ధంగా ఉన్న ఆ పంట మొత్తం ఫెంగల్ తుఫాను ధాటికి వరి పంట నేలవారింది. రెండు రోజులుగా కురిసిన భారీ వర్షానికి వరి మొత్తం తడిసిపోయింది. ధాన్యం తడవకుండా రైతులు పడుతున్న అగచాట్లు వర్ణణాతీతంగా మారాయి. ప్లాస్టిక్ పట్టలతో కప్పి నీరు చేరకుండా ప్రయత్నిస్తున్నారు. వర్షం నీరు తోడుకుంటూ ధాన్యానికి కాపలా ఉండి ఎప్పుడు వాతావరణం అనుకూలిస్తుందో ఆకాశం వైపు చూస్తూ ఉండాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాణ్యం మండలంలో 30 వేల టన్నులు వరి ధాన్యం పండగా 20 వేల టన్నుల ధాన్యం నీటిపాలైనట్లు సమాచారం. మండలంలోని పాణ్యం, కొండజూటూరు, ఆలమూరు, కొనిదేడు, గోరుకల్లు గ్రామాలతో పాటు చెరువుల కింద వరి పంటలు సాగుచేశారు. గోరుకల్లు రిజర్వాయర్ సమీప గ్రామాలైన గోరుకల్లు, కొండజూటూరు గ్రామాలలో ఇతర పంటలు వేసే పరిస్థితి లేకపోవడంతో వరి పంటసాగే శరణ్యమైంది.



ధాన్యం తడవకుండా కప్పిన పట్టలు

ధాన్యాన్ని ఇంటికి చేర్చేలోపే...



మూడెకరాలు కౌలు తీసుకుని వరి పంట సాగు చేశా. పంట ఇంటికి చేర్చేలోపే తుఫాన్ ధాటికి తడిసిపోయింది. ఎకరాకు రూ.22 వేలు కౌలుతో పాటు రూ.30 వేలు పెట్టుబడితో సాగు చేశాను. నాలుగు నెలలుగా కష్టపడి పండించిన పంట చేతికందని పరిస్థితి. మూడెకరాల పంటను కోసి ఆరబెట్టే సమయం కూడా లేకపోవడంతో పంట చేలోనే పట్టలు కప్పి తడవకుండా జాగ్రత్తలు పడుతున్నాం. తుఫాన్ తగ్గకుంటే ధాన్యం మొలకెత్తే ప్రమాదముంది. ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి.

- అవుల కృష్ణ, కౌలు రైతు, పాణ్యం

మహానంది అభివృద్ధిపై
మాస్టర్ ప్లాన్ పరిశీలన

ప్రసాదాల పోటులో నెయ్యి నిల్వలను తనిఖీ చేసిన ఏడీసీ



ఆలయ అభివృద్ధిపై ఈవోతో మాట్లాడుతున్న అడిషనల్ కమిషనర్ రామచంద్రమోహన్

మహానంది, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రం అభివృద్ధిలో భాగంగా తయారు చేసిన మాస్టర్ ప్లాన్‌ను బుధవారం రాష్ట్ర దేవదాయశాఖ అదనపు సహాయ కమిషనర్ రామచంద్రమోహన్ పరిశీలించారు. మహానంది క్షేత్రానికి దైవదర్శనం కోసం వచ్చిన ఏడీసీకి ఆలయం వద్ద ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో స్వామి అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక అభిషేకార్చనలు నిర్వహించారు. అనంతరం ప్రసాదాల పోటును తనిఖీ చేశారు. నెయ్యి నిల్వలను పరిశీలించారు. ప్రసాదాల తయారీకి ఉపయోగించే నెయ్యిని ఏ కంపెనీ నుంచి తెస్తున్నారని ఈవోను అడిగారు. ఇందుకు విజయ డెయిరీ నుంచి కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. ఆలయ ప్రాంగణంలోని క్యూలైన్లు, కోనేర్ల మరమ్మతులపై చర్చించారు. అనంతరం దేవదాయశాఖ ఇన్‌చార్జి ఎస్ఈ సతీష్‌తో పాటు డీఈఈ మెల్లంపూరి శ్రీనివాసప్రసాద్‌తో మహానంది క్షేత్రం మాస్టర్ ప్లాన్ నమూనాను పరిశీలించారు. క్షేత్రం అభివృద్ధిలో భాగంగా 35 సంవత్సరాల వరకు ఏఏ అభివృద్ధి పనుల నిర్మాణాలు జరపాలని చర్చించారు. కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న పనులను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని ఏడీసీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో దేవదాయశాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ త్రినాథరావు, సీఈ శేఖర్‌తో పాటు ఆలయ ఏఈఓ ఎర్రమల్ల మధు, పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి, ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాసులు, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

యురేనియం తవ్వితే
ఊరుకోం

- ప్రజా రోగ్యంతో ప్రభుత్వాలు చెలగాటం
- విష వాయువులు ప్రబలితే పర్యావరణం, పంటలు నాశనం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్యాపిలి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): యురేనియం తవ్వకాలు జరిపితే ఊరుకోమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. యురేనియం తవ్వకాలను వ్యతిరేకిస్తూ బుధవారం మండలంలోని జక్కసానికుంట్ల గ్రామంలో సీపీఐ ఆధ్వర్యంలో గ్రామస్థులు నిర్వహించిన సభలో రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో దాదాపు 40దేశాలు ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని యురేనియం తవ్వకాలను నిషేధించాయని, అయినా మన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం యురేనియం తవ్వకాలకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం బాధాకరమని అన్నారు. మొన్న కర్నూలు జిల్లాలోని కప్పట్రాళలో సీపీఐ ఆధ్వర్యంలో యురేనియం తవ్వకాలను అడ్డుకున్న తర్వాత ఇప్పుడు ప్యాపిలి మండలంలోని జక్కసానికుంట్ల, రాంపురం, మామిళ్లపల్లి గ్రామాల్లో యురేనియం తవ్వకాలకు ప్రభుత్వం టెండర్లు నిర్వహించడం బాధాకరమన్నారు. పచ్చని పల్లెసీమల్లో యురేనియం తవ్వకాలు జరిపితే ప్రజారోగ్యం, పర్యావరణం ఏం కావాలని ఆయన ప్రశ్నించారు. ఈ టెండర్లను రద్దు చేయకపోతే సీపీఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని, ప్రజలు ఆందోళనలకు గురికావద్దని ఆయన భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకులు రామచంద్రయ్య, రామాంజనేయులు, లెనిన్ బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

8న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం



కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 8న నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ జి. నాసరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ సమావేశ భవనంలో జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఉమ్మడి జిల్లా అధికారులు హాజరుకానున్నట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, విద్యుత్ శాఖలపై జరిగే సమావేశాల్లో జడ్పీటీసీలు, ఎంపీపీలు పాల్గొంటారని ఆయన తెలిపారు. అదేవిధంగా ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు 1, 2 స్థాయి సం ఘ సమావేశాలు కూడా నిర్వహిస్తున్నట్లు సీఈఓ పేర్కొన్నారు.

14న జాతీయ లోక్ అదాలత్

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి

కర్నూలు లీగల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి వెల్లడించారు. అందులో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేందుకు పోలీసులు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం స్థానిక లోక్ అదాలత్ కార్యాలయంలో పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీకి అర్హత కలిగి ఉన్న క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, ప్రిలిటిగేషన్ కేసులను ఈ జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అయన కోరారు. న్యాయాధికారి పి.జ్యోత్స్న దేవి మాట్లాడుతూ పోలీసు అధికారులు కక్షిదారులను సంప్రదించి వారిని రాజీ చేసి వీలైనన్ని ఎక్కువ కేసులు పోలీస్ స్టేషన్ల వారీగా పరిష్కారమయ్యేందుకు చొరవ తీసుకోవాలన్నారు. ఈ సమీక్షలో ఎక్సైజ్ కోర్టు మేజిస్ట్రేట్ ఎం.సరోజనమ్మ, పలువురు సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

అయ్యో... దేవుడా..!

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు చిన్నారుల దుర్మరణం

అల్లారుముద్దుగా పెంచుకున్న కుమార్తె.. నిండా ఏడేళ్లు కూడా నిండని చిన్నారి. ఎంతో భవిష్యత్ ఉన్న ఆ చిన్నారి పాఠశాల ప్రహరీకి బలైంది. స్కూలు అయిపోయిందని ఇంటికి వెళ్దామని గోడ పక్కన ఉండగా ఒక్కసారిగా ఆ గోడ కూలి చిన్నారి మీద పడటంతో విద్యార్థిని మృతి చెందిన సంఘటన నందికొట్కూరు పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. అదేవిధంగా బేతంచెర్ల మండలంలో మరో చిన్నారి ఆడుకుంటుండగా నాపరాయి మీదపడి మృతి చెందింది. అప్పటివరకు ముద్దుముద్దు మాటలతో అల్లరిచేసిన చిన్నారులు ఒక్కసారిగా ప్రాణాలను కోల్పోవడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు.

7లో



నందికొట్కూరులో గోడ కూలి మృతి చెందిన షేక్ అస్తమహీన్



బేతంచెర్ల మండలంలో నాపరాయి మీదపడి మృతి చెందిన యామిని

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

- రేపటి నుంచి జనవరి 8 వరకు
- కలెక్టర్ రాజకుమారి



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, జేసీ తదితరులు

నంద్యాల కల్చరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామ స్థాయిలో భూముల సమస్యలను పరిష్కరించే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈనెల 6 నుండి జనవ రి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. బుధవారం సీసీఎల్ఏ కార్యాలయం నుండి రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, రెవెన్యూశాఖ ప్రత్యేక కార్యదర్శి ఆర్పీ సిసోడియా రెవెన్యూ సదస్సులపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించారు. అనంతరం కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ నిర్దేశించిన షెడ్యూలు ప్రకారం రెవిన్యూ సదస్సులు జరుగుతాయన్నారు. ఈ మేరకు సెక్షన్ 22ఎ భూ ఆక్రమణలు, ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించి బాధిత రైతులు రెవెన్యూ సదస్సులలో పాల్గొని అర్జీలు సమర్పించవచ్చునని కలెక్టర్ తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారి, మండలంలో జిల్లాస్థాయి అధికారి నోడల్ ఆఫీసర్లుగా రెవెన్యూ సదస్సులలో పాల్గొంటారన్నారు. కలెక్టర్, జేసీలు ప్రతి నియోజకవర్గంలో జరిగే రెవెన్యూ సదస్సులకు హాజరవుతామన్నారు. సదస్సులో ఇచ్చిన అర్జీలను 45రోజులలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రీసర్వే నిర్వహించినట్లయితే కొత్తగా తయారుచేసిన ఆర్ఓఆర్‌ను చదివి వినిపించడంతో పాటు వాటిపై అభ్యంతరాలు వుంటే స్వీకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్ఓ రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక మస్కా..!

- ఉచితం పేరుతో హంద్రీ నది లూటీ
- కూటమి, వైసీపీ నాయకుల అక్రమ రవాణా
- ప్రేక్షక పాత్రలో పోలీసులు, రెవెన్యూ అధికారులు

కోడుమూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉచితం పేరుతో మసక కొడుతున్నారు. హంద్రీ నదిలో జోరుగా ఇసుక తవ్వకాలు జరిపి అక్రమంగా రవాణా చేస్తున్నారు. కోడుమూరు పట్టణంలోని హంద్రీనది, మండలంలోని గోరంట్ల, వర్కూరు, అనుగొండ, ముడుమలగుర్తి ప్రాంతాల నుంచి రేయింబవళ్లు రోజుకు వందలాది ట్రాక్టర్లలో ఇసుకను అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. కూటమి, వైసీపీ నాయకులు కుమ్మక్కై ఇసుక దోపిడీ సాగిస్తున్నారు. చర్యలు తీసుకోవాల్సిన రెవెన్యూ అధికారులు, పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు.

హంద్రీనది పరివాహక ప్రాంతాల్లో కూడా నిర్మాణ రంగానికి ఇసుక కోసం ట్రాక్టర్ నంబర్, ట్రాలీ నంబర్ పొందుపరుస్తూ సచివాలయాల్లో ఆన్‌లైన్ బుకింగ్ చేసుకోవాలి. బుకింగ్ చేసుకొన్న రశీదును పంచాయతీ కార్యదర్శి అనుమతి తీసుకుని నిర్మాణం చేపడుతున్న ప్రదేశానికి పగలు మాత్రమే ఇసుకను తీసుకెళ్లాలి. ఏ గ్రామంలోని ఇసుకను ఆ గ్రామ పరిధి వరకే ఉపయోగించాలి. అంతేకాకుండా అనుమతి పొందిన వాహనానికి ఉచిత ఇసుక రవాణా అనే ఫ్లెక్సీ ఉండాలని కూటమి ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. కానీ ఇసుక మాఫియా ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఉచితం పేరుతో హంద్రీ నదిని లూటీ చేస్తోంది. రాత్రి వేళల్లో సుదూర ప్రాంతాలకు ఇసుకను తలించుకు పోతున్నారు. ఇందుకు కొంత మంది ప్రజా ప్రతినిధులు ఇసుక దందాకు పూర్తి మద్దతు ఇస్తుండటంతో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు.

కోడుమూరు, గోరంట్ల, వర్కూరు గ్రామాల్లో..

ముఖ్యంగా కోడుమూరు, గోరంట్ల, వర్కూరు గ్రామంలోని కూటమి, వైసీపీ నాయకులతో ఇసుక మాఫియా కుమ్మకై హంద్రీ నదిలోని ఇసుకను ఖాళీ చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇసుకను అక్రమంగా తరలిస్తూ రూ.లక్షలు దండుకుంటున్నట్లు విమర్శలున్నాయి. గోరంట్ల గ్రామంలో ఇద్దరు టీడీపీ నాయకులు కలిసి డోన్, పత్తికొండ, క్రిష్ణగిరి మండలాలకు పెద్ద ఎత్తును ఇసుకను తరలిస్తున్నారు. వర్కూరు గ్రామంలో వైసీపీ, టీడీపీ నాయకులు కలిసి ఇసుక వ్యాపారం సాగిస్తున్నారు. కోడుమూరులో వైసీపీ, టీడీపీ నాయకుల కనుసైగల మధ్య అక్రమ ఇసుక రవాణా సాగుతోందన్న చర్చ సాగుతోంది. ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోకుండా పంచాయతీ కార్యదర్శి అజయ్‌భాస్కర్ ఇసుక తరలింపునకు ఇష్టారాజ్యంగా అనుమతులు ఇచ్చారు. దీంతో రెచ్చిపోయిన ఇసుక మాఫియా రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుకను తరలించుకుపోతోంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవలసిన అవసరం ఉంది.



హంద్రీలో ఇసుక తవ్వకాలు

(మిగతా 6వ పేజీలో...)

నట నారాయణ

కళ

- పౌరాణికంలో వడ్డె నారాయణ
- 60కి పైగా పాత్రలు..
- 40 ఏళ్లుగా మూడు రాష్ట్రాల్లో ప్రదర్శనలు



రామాంజనేయ యుద్ధం నాటకంలో రాముని వేషధారణలో వడ్డె నారాయణ

మంత్రాలయం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పౌరాణికంలో అందరినీ మెప్పించే నటన ఆయన సొంతం. సత్యహరిశ్చంద్ర నాటకమంటే ఆయన గుర్తుకు రావాల్సిందే. 40 ఏళ్లలో వివిధ నాటకాల్లో 60 పాత్రలు ప్రదర్శించి పేరుప్రఖ్యాతులు సంపాదించారు. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక ప్రాంతాల్లో పౌరాణిక నాటక ప్రదర్శనలు చేసి పలువురి నుంచి మన్ననలు పొందారు. సత్య హరిశ్చంద్ర నాటకంలో దర్బార్ పాత్ర, అరణ్య, కాటిసీను, వారణాసి, కాటికాపరి వంటి పాత్రలు పోషించారు. మంత్రాలయంలో చిన్న లాడ్జీలను అద్దెకు తీసుకుని జీవిస్తున్న వడ్డె నారాయణ గతంలో ఆదోని పేపరు పేపరు మిల్లులో పని చేస్తుండేవారు. డిగ్రీ వరకు అభ్యసించి శుభకార్యాలు, ఆరాధనోత్సవాలు, పండుగలు, గ్రామ దేవర్లు వంటి వేడుకల్లో నాటక ప్రదర్శనలు ఇస్తున్నారు. నారాయణ సొంతంగా శ్రీరాఘవేంద్ర నాటక కళాసమితి ప్రధాన కార్యదర్శిగా 2007లో 30 మంది కళాకారులతో రిజిస్ట్రేషన్ చేసి తోటి కళాకారులకు ఆర్థికంగా ఆదుకుంటూ వారి కష్టాలు తీరుస్తూ ముందుకు వెళ్తున్నారు. రామాంజనేయ యుద్ధం నాటకంలో రాముడు, కురుక్షేత్రంలో కృష్ణుడు, యమ రావణ యుద్ధంలో నారదుడు, యముడు, చింతామణి నాటకంలో సుబ్బిశెట్టి, బలిదానంలో, పరిశుభ్రత, పచ్చదనం, శ్రమదానంలో సాంఘిక నాటకం, నిరక్షరాస్యత పొదుపు మహిళల అవగాహన, ఎయిడ్స్ నివారణ, హరిత మంత్రాలయం తీర్చిదిద్దేందుకు సాంఘిక సామాజిక నాటకాల ప్రదర్శన చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. గురువు భోజప్ప, హార్మోనిస్టుగా పద్మనాభాచార్, రామవేంద్రాచార్ ఆధ్వర్యంలో కళానాటక రంగానికి కృషి చేస్తూ ప్రశంసలు పొందుతున్నారు.

● కళాకారులకు పింఛన్ సౌకర్యం కల్పించాలి



మారుతున్న కాలంలో పౌరాణిక నాటకానికి ప్రాముఖ్యత తగ్గుతున్నది. పౌరాణిక కళారంగానికి జిల్లా కేంద్రంలో స్థలం కేటాయించాలి. కళా ప్రాంగణం నిర్మించి కళలను ప్రోత్సహించాలి. కళాకారులకు పింఛన్ సౌకర్యం కల్పించేలా ప్రభుత్వం కృషి చేయాలి.

- వడ్డె నారాయణ



పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులతో వడ్డె నారాయణ

ఇసుక మస్కా..!

(5వ పేజీ తరువాయి)

అడుగంటుతున్న భూగర్భ జలాలు



ప్రధాన రోడ్డు పక్కనే నిల్వ చేసిన ఇసుక డంప్

ఇసుక మాఫియా రెచ్చిపోయి హంద్రీ నదిలోని ఇసుకను తోడేశారు. నదిలోని మంచినీటి పథకాల దగ్గర ఉన్న ఇసుకను కూడా తవ్వుకెళ్లారు. దీంతో నదిలోని భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. ఈ విషయంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భూగర్భ జలాలు ఇంకిపోవడంతో రాబోయే రోజుల్లో కోడుమూరు ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఉన్నాయని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వాపోతున్నారు. ఇదే పరిస్థితి వర్కూరు, గోరంట్ల, ముడుమలగుర్తి గ్రామ ప్రజలు కూడా ఎదుర్కోవాల్సి ఉంది.

ఆన్‌లైన్ చేసుకుంటేనే ఇసుక



ఇసుక కావాలంటే సచివాలయంలో వాహన నంబర్‌తో ఆన్‌లైన్ చేసుకొని రశీదు తీసుకొని రావాలి. హంద్రీనదిలో చూపించిన ప్రాంతంలో మాత్రమే ఇసుక తవ్వుకోవాలి. ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా పాటించాలి.

అజయ్‌భాస్కర్, పంచాయతీ కార్యదర్శి, కోడుమూరు.

అనుమతి లేకుంటే వాహనాలు సీజ్ చేస్తాం



అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే వాహనాలను సీజ్ చేస్తాం. అంతేగాకుండా రాత్రి వేళల్లో ఇసుకను తరలించడం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధం. అక్రమంగా ఇసుకను తరలించాలని ప్రయత్నం చేస్తే సహించేది లేదు.

- తబ్రేజ్, సీఐ, కోడుమూరు

సమన్వయంతో పని చేయండి

● ఎస్పీ బిందుమాధవ్



కర్నూలు క్రైం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మహిళల భద్రత, రక్షణకు అన్ని శాఖలు కలిసి సమన్వయంతో పని చేయాలని ఎస్పీ జి. బిందుమాధవ్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, ఐసీడీఎస్, విద్యాశాఖ, లేబర్ డిపార్టుమెంట్, అంగన్‌వాడీ టీచర్లు, వర్కర్లు, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయ శాఖల సిబ్బందితో ఎస్పీ సమావేశం నిర్వహించారు. లైంగిక నేరాల నుంచి పిల్లలకు రక్షణ కల్పించాలనే కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ బాల్య వివాహాలు, చిన్న పిల్లలు భిక్షాటన ఎక్కడా కూడా కనిపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలు, చిన్నారుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ల గురించి బాలికలకు అవగాహన కల్పించాలన్నారు. మిస్సింగ్, పోక్సో కేసులు తగ్గుముఖం పట్టేలా కౌన్సెలింగ్ చేయాలన్నారు. బాలబాలికల రక్షణ సహాయం కోసం చైల్డ్‌లైన్ 1098, హెల్ప్‌లైన్ 181, పోలీస్ డయల్ 100కు గానీ సమాచారం అందించేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్‌పర్సన్ ఎస్.జుబేదాబేగం, డీఈఓ శామ్యూల్ పాల్, బాలల సంరక్షణ అధికారి శారద, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ డిపార్టుమెంట్ అధికారి నీలకంఠేశ్వర్, సీఐలు ప్రసాద్, శివశంకర్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

7న మెగా సమావేశం : కలెక్టర్



కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 7వ తేదీన జరిగే మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాన్ని ఎలాంటి లోటుపాట్లు లేకుండా విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం పేరెంట్స్, టీచర్స్ మెగా సమావేశం ఏర్పాట్లపై ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంఈవోలతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజాప్రతినిధులు అందరూ ఒకే చోట కార్యక్రమానికి హాజరు కాకుండా ఒక్కొక్కరు ఒక పాఠశాలలో కార్యక్రమానికి హాజరయ్యేలా చూడాలని డీఈవోను సూచించారు. ఈ కాన్ఫరెన్స్‌లో డీఈవో శామ్యూల్ పాల్ పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

టీటీడీ ఛైర్మన్‌కు విరాళం అందజేస్తున్న గౌరు వెంకటరెడ్డి



కర్నూలు కల్చరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తిరుమలలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రూ.99వేలు విరాళం అందజేశారు. బుధవారం తిరుమలలో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడును వారు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం గౌరు వెంకటరెడ్డి అన్నదాన నిర్వహణకు సంబంధించిన రూ.99 వేల చెక్కును బీఆర్ నాయుడుకు అందించారు.

బ్యాంకర్లు రైతులకు రుణాలు ఇవ్వాలి

కలెక్టర్ రాజకుమారి



పీఎంఎస్‌బీవై కింద ప్రీమియం చెల్లించిన వ్యక్తి కుటుంబానికి ఇన్సూరెన్స్ చెక్కును అందజేస్తున్న కలెక్టర్

నంద్యాల కల్చరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతులకు విరివిగా రుణాలు మంజూరు చేసి సహకరించాలని కలెక్టర్ రాజకుమారి బ్యాంకర్లను కోరారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో రుణాల మంజూరుపై సంబంధిత అధికారులు, బ్యాంకర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో సీసీఆర్సీ కార్డులు మంజూరు చేసిన కౌలు రైతులకు రుణాలు ఇవ్వడంలో బ్యాంకర్లు విఫలమయ్యారని, అన్నం పెట్టే రైతులను ఆదుకోవడానికి బ్యాంకర్లు ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. ఆర్‌ఓఎఫ్‌ఆర్ భూములకు, సూక్ష్మసేద్య పరిశ్రమలకు, మహిళా సాధికారత ఉపాధికి, విద్యా రుణాలు, గృహ రుణాలు, చేనేత రుణాలు, తదితర ప్రాధాన్యత రంగాలకు కేటాయించిన ప్రతి లక్ష్యంలో 50 శాతం కూడా అధిగమించలేదని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. స్వయం సహాయక సంఘాల రుణాలు మినహా ఇతర ఏ ప్రాధాన్యత రంగాలకు బ్యాంకర్ల నుంచి సహకారం లేదన్నారు. స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లు రుణాల మంజూరులో తీవ్ర జాప్యం చేస్తూ ఎలాంటి సహకారం ఇవ్వడం లేదని అన్నారు. రుణాలు మాంజూరుకు బ్యాంకర్లు సహకరించాలన్నారు.

సీసీఐ కేంద్రాల వద్ద రైతుల రద్దీ

● రోజూ రూ. కోటిన్నర విలువ చేసే పత్తి కొనుగోళ్లు



పత్తి రైతులతో సెక్రటరీ సుందర్‌రాజు

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రోజూ చిరుజల్లులు కురుస్తున్నందున కర్నూలు, నంద్యాల జిల్లాల రైతులు పత్తిని త్వరగా అమ్ముకునేందుకు పెంచికలపాడు సీసీఐ కేంద్రానికి పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. బుధవారం కోడుమూరు మార్కెట్ కమిటీ యార్డు సెక్రటరీ సుందర్‌రాజు, సూపర్‌వైజర్ శ్రీను సీసీఐ కేంద్రం వద్ద రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టారు. పెద్ద ఎత్తున పత్తిని విక్రయించేందుకు లారీలు, ట్రాక్టర్లలో రైతులు తరలివస్తుండటంతో వారికి ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా సీసీఐ కేంద్రం వద్ద త్వరితగతిన నమోదు ప్రక్రియ జరిగేందుకు సెక్రటరీ సుందర్‌రాజు, సూపర్‌వైజర్ శ్రీను అక్కడే ఉండి పనులు చేస్తున్నారు. ప్రతి రోజు రూ. కోటిన్నర విలువ చేసే పత్తిని సీసీఐ కేంద్రం అధికారులు కొనుగోలు చేసేలా శ్రద్ధ తీసుకుంటున్నామని, ఇటువంటి రద్దీ గతంలో ఎప్పుడూ లేదని వారు తెలిపారు. ప్రభుత్వం తేమ శాతం సడలింపు చేసినట్లు సమాచారం అందడంతో రైతులు పెద్ద ఎత్తున విక్రయానికి తరలివస్తున్నారని అన్నారు. 8 శాతం తేమ ఉంటే క్వింటానికి రూ.7,521, 12 శాతానికి పైబడి ఉంటే.. రూ.7వేల దాకా రైతులకు ఇస్తున్నట్లు సెక్రటరీ సుందర్‌రాజు తెలిపారు.

బడుల్లో పండుగ

- విద్యా ప్రమాణాల పెంపే లక్ష్యం
- ఈ నెల 7న మెగా పేరెంట్లు, టీచర్ల సమావేశం
- విద్యాపరమైన అంశాలపై చర్చ
- ఆటల పోటీలు, సహపంక్తి భోజనాలు
- పూర్వ విద్యార్థులకు ఆహ్వానం
- జిల్లాకు రూ.47 లక్షలు మంజూరు

ఆలూరు, డిసెంబరు 4, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచడంతోపాటు సహృద్భావ వాతావరణం కల్పించేందుకు పాఠశాల విద్యాశాఖ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పాఠశాలల్లో ఉత్తమ విద్య అందించేందుకు, అభివృద్ధిలో అందరినీ భాగస్వాములను చేసేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను కలిపి ఒకే వేదికపైకి చేర్చింది. విద్యాపరమైన అంశాలను చర్చించడంతోపాటు ఆటపాటలు, శుభ తిథి పేరుతో సహపంక్తి భోజనాలు, పిల్ల ప్రగతి నివేదికలు అందజేయనున్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆదేశాల మేరకు శుభతిథి పేరుతో ఈ నెల 7వ తేదీన మెగా పేరెంట్, టీచర్స్ సమావేశాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు విద్యారంగంలో వస్తున్న అనేక సంస్కరణలను పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాలల మధ్య సంబంధాలను బలపరచడానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ పాఠశాలలను మరింత అభివృద్ధి చేసి 2047 నాటికల్లా వికసిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలని సంకల్పించింది. దీనిలో భాగంగానే జిల్లాలోని 1485 ప్రభుత్వం పాఠశాలల్లో ఈ నెల 7వ తేదీన మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ సమావేశాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖ అన్ని రకాల ఏర్పాట్లు చేస్తోంది. దీని కోసంగా రూ.47 లక్షల నిధులు కూడా ప్రభుత్వం విడుదల చేసింది. పది మంది పిల్లలు ఉన్న బడులకు రూ.వెయ్యి, 300 నుంచి 200 మంది పిల్లలు ఉన్న రూ. 5 వేలు ఇలా సంఖ్యలను బట్టి ఆయా పాఠశాలలకు నిధులను కేటాయించారు. జిల్లా విద్యాశాఖ అధికారులు, సమగ్ర శిక్ష అధికారులు ఆ కార్యక్రమంలో పర్యవేక్షించనున్నారు. వారం రోజులు ముందుగానే అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని ఇప్పటికే కలెక్టర్ అధికార్లకు ఆదేశాలు ఇవ్వడంతో జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఏర్పాట్లు జరుగుతున్నాయి. తల్లిదండ్రుల కమిటీల సమావేశాలు కొత్త కానప్పటికీ ఈసారి మాత్రం పలు ప్రత్యేకతలు రూపొందించారు. ఎన్నడూ లేని విధంగా పిల్లల సంఖ్యను బట్టి ఆయా పాఠశాలలకు నిధుల కేటాయింపులు చేశారు. పూర్వ విద్యార్థులు, దాతలు, ఉపాధ్యాయులు ఎవరి స్థాయిలో వారు మరికొంత నిధులు సేకరించి కార్యక్రమాలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యా శాఖ మార్గదర్శకాల ప్రకారం ఆహ్వానం కమిటీ, నిర్వహణ కమిటీ, బడ్జెట్ కమిటీ, బడి సుందరీకరణ కమిటీ, పర్యావరణ పరిరక్షణ కమిటీ, నిర్వహణ కమిటీ, స్టేజీ నిర్వహణ వంటి కమిటీలను ఏర్పాటు చేయనున్నారు.

● పిల్లల ప్రగతిపై నివేదికలు

పిల్లల ప్రగతికి సంబంధించిన పూర్తి స్థాయి నివేదికలను ఈ సమావేశంలోనే తల్లిదండ్రులకు అందజేయనున్నారు. ప్రోగ్రెస్ కార్డుల్లో మార్పులు, హాజరుతోపాటు ఆటలు, సాంస్కృతిక నిర్ధారణ పరీక్షల వివరాలు పొందుపరుస్తున్నారు. విద్యార్థులు ఇళ్ల వద్ద సెల్‌ఫోన్, ట్యాబ్‌లు అధికంగా వినియోగించకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంతోపాటు తల్లిదండ్రులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తారు. పూర్వ విద్యార్థులు, ప్రజాప్రతినిధులను ప్రత్యేకంగా ఆహ్వానించి కార్యక్రమం విజయవంతం చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. అలాగే సమావేశానికి సంబంధించి మీటింగ్ షెడ్యూలు కూడా విడుదల చేశారు. ఉదయం 9 నుంచి 12.30 గంటల వరకు వివిధ కార్యక్రమాల అనంతరం సహపంక్తి భోజనం చేస్తారు.

● ప్రతిష్ఠాత్మకంగా మెగా పేరెంట్స్ కమిటీ నిర్వహణ



జిల్లా మెగా పేరెంట్, టీచర్ మీటింగ్‌ను డిసెంబరు 7న జిల్లాలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నాం. విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందిచడంతోపాటు పాఠశాలల అభివృద్ధి చేస్తున్న, చేపట్టబోవు కార్యక్రమాలపై తల్లిదండ్రులతోపాటు పాఠశాలల అభివృద్ధిలో ప్రజలను భాగస్వాములను చేయడం, పది పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయడం, సైబర్ నేరాలపై అవగాహన, విద్యార్థుల పురోగతి. జరిగిన పరీక్షల్లో వచ్చిన మార్కుల గూర్చి ఈ మెగా పేరెంట్స్ మీటింగ్ ప్రత్యేక ఉద్యేశం. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు సూచనలు, సలహాలతో కార్యక్రమం విజయవంతం చేస్తాం.

- శ్యామ్యూల్ పాల్, జిల్లా విద్యాశాఖాధికారి



ఆలూరు ప్రభుత్వ పాఠశాల

'స్వచ్ఛ' సేవకులు

- సమాజ సేవ చేస్తూ ఉపాధి పొందుతున్న యువకులు
- నంద్యాల-గిద్దలూరు నల్లమల రహదారిలో వ్యర్థాల సేకరణ
- ప్లాస్టిక్ రహిత నల్లమల కోసం కృషి
- వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

శిరివెళ్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వన్యప్రాణులు, విభిన్న వృక్షజాతులకు నెలవైన నల్లమల అటవీ ప్రాంతంలో ప్లాస్టిక్ వస్తువుల వినియోగంపై అటవీశాఖ నిషేధం విధించింది. ఒకసారి వాడి పారేసే ప్లాస్టిక్ వస్తువుల వ్యర్థాలతో వన్యప్రాణుల మనుగడకు ముప్పు వాటిల్లుతోంది. దీంతో ప్లాస్టిక్ రహిత నల్లమలగా తీర్చిదిద్దేందుకు స్వచ్ఛ సేవకులను నియమించింది. నంద్యాల-గిద్దలూరు ప్రధాన రహదారిలో నంద్యాల జిల్లా మహానంది మండలం గాజులపల్లె నుంచి ప్రకాశం జిల్లా సరిహద్దుల్లోని దిగువమెట్ట ప్రాంతం వరకు దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో ఈ స్వచ్ఛ సేవకులు ప్రతిరోజూ రహదారి వెంట పర్యటిస్తూ ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తున్నారు. పచ్చర్ల అటవీ సెక్షన్ పరిధిలో పలు గ్రామాలకు చెందిన 13 మంది యువకులు ఓ వైపు సమాజసేవలో భాగంగా బాధ్యతగా పని చేస్తూనే.. మరో వైపు ఉపాధి సైతం పొందుతున్నారు. రహదారి వెంట, అటవీ ప్రాంతంలో ప్రయాణికులు విసిరిపడేసే ప్లాస్టిక్ కవర్లు, వాటర్ బాటిళ్లను ఏరివేసి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రదేశంలో పోగు చేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న స్వచ్ఛ సేవకులకు అటవీశాఖ నెలకు రూ.9 వేల చొప్పున గౌరవ వేతనం చెల్లిస్తోంది.



నల్లమలలో సేకరించిన ప్లాస్టిక్ వ్యర్థాలు

● పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత :



పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉంది. స్వచ్ఛ సేవకుడిగా అటవీ ప్రాంతంలోని ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరివేస్తూ ఉపాధి పొందుతున్నాను. వ్యర్థాల వల్ల వన్యప్రాణులకు కలిగే ముప్పును ప్రయాణికులకు తెలియజేస్తున్నాం.

- రంగస్వామి, పచ్చర్ల

యువ



నల్లమలలో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తున్న స్వచ్ఛ సేవకులు

● అవగాహన కల్పిస్తున్నాం



రహదారిలో ప్రయాణించే వాహనదారులు, ప్రకృతి అందాలను తిలకించేందుకు వచ్చే వారికి ప్లాస్టిక్ రహిత నల్లమల కోసం చేపట్టిన ప్రణాళికపై అటవీశాఖ సిబ్బందితో కలిసి అవగాహన కల్పిస్తున్నాం. అటవీ ప్రాంతంలో ఎక్కడబడితే అక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలను వేయకుండా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెత్త కుండీల్లోనే వేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

- వసంత్ కుమార్, మహదేవపురం

పాఠశాల ప్రహరీ కూలి

విద్యార్థిని మృతి



విద్యార్థిని మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లిదండ్రులు

నందికొట్కూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): చక్కగా స్కూల్ డ్రెస్ ధరించి, భుజాన బ్యాగ్‌తో తోటి చిన్నారులతో ఆడుతూపాడుతూ హాయిగా పాఠశాలకు వెళ్లిన ఆ చిన్నారికి అదే చివరి రోజైంది. పాఠశాల ప్రహరీ రూపంలో ఆరేళ్ల చిన్నారిని మృత్యువు కబళించింది. పాఠశాల ప్రహరీ కూలి రెండో తరగతి చదువుతున్న ఓ చిన్నారి మృతి చెందిన విషాద సంఘటన నందికొట్కూరు పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. ఇదే సంఘటనలో మరో ఇద్దరు చిన్నారులు కూడా గాయపడ్డారు. ఇందుకు సంబంధించిన వివరాలు... నందికొట్కూరు పట్టణంలోని కాలేజీ రోడ్డులో జీవిస్తున్న షేక్ శాలుబాషా, షేక్ రుక్సానాలకు షేక్ అస్తమహీన్(6)తో పాటు కుమారుడు సంతానం. చిన్నారి అస్తమహీన్ పట్టణంలోని విద్యానగర్‌లో ఉన్న ఎంపీపీ ఉర్దూమీడియం పాఠశాలలో 2వ తరగతి చదువుతోంది. రోజులాగే అస్తమహీన్ పాఠశాలకు వెళ్లింది. సాయంత్రం స్కూల్ వదిలాక ఇంటికి వచ్చే సమయంలో స్కూల్ గేటును ఆయా మూస్తుండగా గోడకు ఆనుకుని ముగ్గురు విద్యార్థులు నిలిచి ఉన్నారు. ఆయా గేటు వేస్తున్న తరుణంలో గోడ ఒక్కసారిగా కూలి విద్యార్థులపై పడింది. దీంతో అక్కడికక్కడే విద్యార్థిని అస్తమహీన్ మృతి చెందగా, మరో ఇద్దరు విద్యార్థినులు తబస్సుం, షేక్ అజీద్ గాయాలపాలయ్యారు. ఘటన జరిగిన వెంటనే ఆయా నూర్జహాన్ అక్కడి నుంచి భయంతో పరారైంది. స్కూల్ ఉర్దూ టీచర్ షేక్ సబిహా విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులకు, పోలీసులకు తెలియజేశారు. గాయాలపాలైన విద్యార్థులను నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తండ్రి పట్టణంలో పెయింటర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కుమార్తె మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

- ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, వైస్ చైర్మన్ రబ్బాని, కౌన్సిలర్లు జాకీర్, నాయకులు చేరుకొని వివరాలు తెలుసుకు న్నారు. నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రిలో విద్యార్థిని తల్లిదండ్రులను పరామర్శించారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి విద్యార్థిని తల్లిదండ్రులకు న్యాయం జరిగేలా చూస్తామని ఎమ్మెల్యే భరోసా తెలిపారు. మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి కూడా సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

నాపరాయి పడి చిన్నారి దుర్మరణం



చిన్నారి యామిని మృతదేహం

బేతంచెర్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బేతంచెర్ల-డోన్ రహదారిలో ఉన్న నాపరాళ్ల పాలిష్ ఫ్యాక్టరీ ఆవరణలో బండలు పడి బుధవారం ఓ చిన్నారి మృతి చెందింది. కొలుములపల్లె గ్రామానికి చెందిన మద్దయ్య, సువర్ణ దంపతులు నాపరాళ్ల పాలిష్ ఫ్యాక్టరీలో పని చేయడానికి వెళ్లగా వారితో పాటు తమ కుమార్తె యామిని(5)ని కూడా వెంట తీసుకెళ్లారు. తల్లిదండ్రులు పనుల్లో నిమగ్నమై ఉండగా.. ఆడుకుంటున్న యామినిపై నిలిపి ఉంచిన నాపరాళ్లు మీద పడి అక్కడికక్కడే దుర్మరణం చెందింది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు సంఘటనా స్థలానికి వెళ్లి రోదించిన తీరు కలచివేసింది. బేతంచెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డీపీఆర్‌సీలో రెండు రోజుల శిక్షణ

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్, నిధులతో ఏపీ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై రెండు రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం ప్రిన్సిపాల్ జి. నాసరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5,6 తేదీలలో డీపీఆర్‌సీలో జరిగే శిక్షణకు ఈఓఆర్‌డీలు/ పంచాయతీ కార్యదర్శి, ఎంపీహెచ్‌ఈవో, ఏపీ ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ ఏఈ, ఏపీఎం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శాఖకు ఒక్కరు చొప్పున మండలానికి ఆరుగురు శిక్షణకు హాజరుకావాలన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారందరూ ఈ నెల 10 నుంచి 13 వరకు మండలాలలో రెండు రోజులు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, మండల లైవ్ డిపార్ట్‌మెంట్ అధికారులు, సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇస్తారన్నారు.

బహిరంగ ధరకు మించి కొనుగోలు

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో కంది పంటలను సాగు చేసిన రైతులకు అదృష్టం వరించింది. కేంద్ర ప్రభుత్వం కందులకు క్వింటం రూ.7,600 మద్దతు ధరను ప్రకటించింది. అయితే బహిరంగ మార్కెట్‌లో క్వింటం ధర రూ.9,400 పోతుండటంతో అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రైతుల సంతోషాన్ని మరింత ఎక్కువ చేసేందు కోసం రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కందులను మార్కెట్‌లో లభించే ధర కంటే ఎక్కువ ధరకు కొనుగోలు చేసేందుకు నిర్ణయించినట్లు మార్క్‌ఫెడ్ అధికారులు తెలిపారు. మార్క్‌ఫెడ్ ద్వారా ఉమ్మడి జిల్లాలో వంద మెట్రిక్ టన్నులను కొనుగోలు చేసే అవకాశం దక్కింది. కేంద్ర ప్రభుత్వం నాఫెడ్ ద్వారా ఉమ్మడి జిల్లాలో 100 మెట్రిక్ టన్నులను రైతుల నుంచి కొనుగోలు తీసుకోవాలని, అవసరమైన ఏర్పాట్లు చేయాలని జారీ చేసిన ఉత్తర్వులు మార్కెట్ ఫెడ్ కార్యాలయానికి చేరాయి. బుధవారం స్థానిక కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆధ్వర్యంలో జిల్లా ప్రొక్యూర్మెంట్ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. ఎక్కడెక్కడ జిల్లాలో కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాటు చేయాలో ప్రాథమిక వ్యవసాయ సంఘాలతో పాటు డీసీఎంఎస్ ద్వారా కొనుగోలు ఏర్పాటు చేసి రైతుల నుంచి రూ.లక్ష మేరకు వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

రేపు కళా ఉత్సవ్ పోటీలు

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తాండ్రపాడు డైట్ కళాశాలలో ఈ నెల 6వ తేదీన జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్, కేంద్రీయ నవోదయ రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువుతున్న 9 నుంచి 12వ తరగతుల విద్యార్థులకు జిల్లా స్థాయిలో కళా ఉత్సవ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు డైట్ ప్రిన్సిపాల్ జనార్దన్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాత్ర సంగీతం, వోకల్ మ్యూజిక్ బృందం, వాయిద్య సంగీతం, డ్యాన్స్, ఏకపాత్రాభినయం, డ్రామా, విజువల్ ఆర్ట్స్, ఎడిషనల్ స్టోరీ స్పెల్లింగ్ వంటి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంపికైన విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు లెక్చరర్ ప్రభాకర్ బాబును 8985126758 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పుల్లారెడ్డి వీధికి చెందిన ఓ విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఆళ్లగడ్డ పోలీసులు బుధవారం తెలిపారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థినిని పాఠశాలకు వెళ్లమని తల్లి మందలించడంతో ఇంట్లో చున్నీతో ఆత్మహత్యాయత్నం చేసిందన్నారు. బాధితురాలిని ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు, మెరుగైన వైద్యం నిమిత్తం కుటుంబసభ్యులు నంద్యాలలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారన్నారు. బాధితురాలి తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని పట్టణ పోలీసులు వెల్లడించారు.

సరిదిద్దేవారెవరు?



- షోకాజు నోటీసులు.. మెమోలకే పరిమితం
- ఉదాసీనంగా వ్యవహరిస్తున్న అధికారులు

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి):

నగర పాలక సంస్థ పరిధిలో కొందరు అధికారులు, ఉద్యోగులు ఇష్టానుసారంగా విధులు నిర్వహిస్తున్నారు. వాళ్లను చక్కదిద్దేవారే లేరనే విమర్శలు వినిపిస్తున్నాయి. కార్యాలయంలోని ప్రతి విభాగాన్ని ప్రక్షాళన చేయాలని స్వయంగా రాష్ట్ర మంత్రి టీజీ భరత్ ప్రతి సమావేశంలో చెబుతూనే ఉన్నారు. ఈ దుస్థితి అంతా ఓ ఉన్నతాధికారి నిర్వాకమే అనే ఆరోపణలు వస్తున్నాయి. రాష్ట్ర మంత్రి, ఎమ్మెల్యేలు, కమిషనర్‌కు తెలిసినా కూడా ఏమి చేయలేని పరిస్థితుల్లో ఉన్నారనే ఆరోపణలు ఉన్నాయి. నగర పాలక సంస్థలోని ఓ విభాగంలో విధుల పట్ల అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారనే విమర్శలు ఉన్నాయి. ఇట్లా నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులు, ఉద్యోగులకు ఉన్నతాధికారులు షోకాజు నోటీసులు, మెమోలు జారీ చేశారు. ఇప్పటి వరకు షోకాజు నోటీసులు, మోమోలు తీసుకున్న వారెవ్వరూ వివరణ ఇవ్వలేదు. అలాంటి వారిపై శాఖాపరమైన చర్యలు ఏమైనా తీసుకుంటున్నారా.. లేదా అనే విషయంలో స్పష్టత లేదు. దీంతో మిగిలిన వారు కూడ తప్పులు చేసుకుంటు వెళ్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఉన్నతాధికారులు కేవలం షోకాజు నోటీసులు, మోమోలు ఇస్తారు...అంతే దాని పైన ఎలాంటి చర్యలు ఉండవని ప్రతి ఒక్కరికీ అర్థమైంది.

ఆరోపణలు ఎన్నో

నగర పాలక సంస్థలోని ఓ విభాగంలో కాంట్రాక్టరు ఇష్టానుసారంగా పనులు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో ఉన్నతాధికారి ఆ కాంట్రాక్టర్‌కు సంబంధించిన అధికారులు, ఉద్యోగులకు మెమోలు జారీ చేసారు. ఆరోపణలపై వెంటనే వివరణ ఇవ్వాలని సుమారు 12 మందికి మెమో జారీ చేశారు. అంతే కాకుండా ముగ్గురు కింది స్థాయి ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు వారికి కూడా షోకాజు నోటీసులు జారీ చేశారు. మరో ఆప్కాస్ ఉద్యోగి సచివాలయంలో అసభ్యకరంగా ప్రవర్తించినందుకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో మెమోలు, షోకాజు నోటీసులు తీసుకున్న వారందరూ ఇప్పటి వరకు ఎలాంటి వివరణ ఇచ్చారో బయటికి పొక్కకుండా జాగ్రత్త పడుతున్నారు.

ఇంకేమైనా సర్దుకున్నారా..?

వివిధ ఆరోపణలు ఎదుర్కొంటున్న వారంతా మెమోలు, నోటీసులకు వివరణ ఇచ్చారా... లేదా వేరే విధంగా సర్దుకున్నారా అనే విషయంపై నగర పాలక కార్యాలయంలో గుసగుసలాడుతున్నారు. ప్రధానంగా ఓ ఉన్నతాధికారి ఇదంతా కావాలనే చేస్తున్నారని, మిగతా అధికారులు, ఉద్యోగుల వద్ద భారీ మొత్తంలో నగదు వసూలు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. వసూళ్లంతా ఆ అధికారి పక్కనే ఉన్న ఓ వ్యక్తి కనుసన్నల్లో నడుస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇదంతా రాష్ట్ర మంత్రి, ఎమ్మెల్యేలు, కమిషనర్‌కు తెలిసిన కూడా ఏమీ చేయలేని పరిస్థితుల్లో ఉన్నారు. ఇలాంటప్పుడు నగర పాలక సంస్థలో ప్రక్షాళన ఎవరు చేస్తారని కొందరు ప్రశ్నిస్తున్నారు.

మెరుగైన వైద్యం అందించండి

- పాత భవనంలో చికిత్స అందించడంపై ఎమ్మెల్యే ఆగ్రహం



వైద్యులతో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న గౌరు చరితారెడ్డి

ఓర్వకల్లు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. బుధవారం ఓర్వకల్లులోని సామాజిక ఆరోగ్య కేంద్ర అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. పాత భవనం వదిలేసి కొత్త భవనంలో రోగులకు వైద్య సేవలందించాలని ఆదేశించినా ఎందుకు చర్యలు తీసుకోలేదని ఎమ్మెల్యే మండిపడ్డారు. పాతబడిన గదులను ఆమె పరిశీలించారు. నూతనంగా నిర్మించిన ఆసుపత్రి గదులను పరిశీలించారు. త్వరలోనే కొత్త భవనంలో వైద్య సేవలు అందించాలని మెడికల్ ఆఫీసర్‌ను ఆదేశించారు. అనంతరం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఆసుపత్రి కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు సీహెచ్‌సీలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఆసుపత్రిలో 24 గంటల్లో వైద్యసేవలు అందించాలని, విద్యుత్ సరఫరా అయ్యే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణ రోగులకు అత్యవసర చికిత్స నిమిత్తం అల్ట్రాసౌండ్ మిషన్‌ను ఎక్స్‌రే పరికరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆసుపత్రికి ఇన్వర్టర్ సదుపాయం, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆవరణలో విద్యుద్దీపాల ఏర్పాటు, తొలగించిన అంబు లెన్స్‌ను పునఃప్రారంభించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాసులు, మెడికల్ ఆఫీసర్ ఎస్‌ఐ సునీల్ కుమార్, మంజుల, వైద్యులు అశ్విన్, శ్రీకాంత్, దాదాబాషా, నవ్యతేజ పంచాయతీ కార్యదర్శి నాగరాజు, రీసర్వే డీటీ షర్మిలారెడ్డి, గ్రామ నాయకులు రాంభూపాల్ రెడ్డి సుధాకర్‌రావు, అన్వర్ బాషా వేణుగోపాల్ రెడ్డి, ఏసేపు, అబ్దుల్లా పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఒకరు డీబార్

కర్నూలు అర్బన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): డిగ్రీ 5వ సెమిస్టర్ పరీక్షలో ఒకరు డీబార్ అయ్యారని పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం రాయలసీమ యూనివర్సిటీలోని 64 పరీక్షా కేంద్రాల్లో 4,219 మంది దరఖాస్తు చేసుకోగా 3,892 మంది పరీక్షలకు హాజరయ్యారు. నగరంలోని శ్రీసాయి కృష్ణ డిగ్రీ కళాశాలలో పరీక్షలు జరుగుతున్న తీరును ఇన్‌చార్జి ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ పరిశీలించారు.

యాగంటి క్షేత్రంలో గుంతకల్లు వాసి మృతి

బనగానపల్లె, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): యాగంటి క్షేత్రంలో అనంతపురం జిల్లా గుంతకల్లు మండలం పాతకొచ్చెర్వుకు చెందిన ఓ యువకుడు మృతి చెందాడు. పాతకొచ్చెర్వుకు చెందిన బోయ సురేంద్ర (27) తన స్నేహితులతో కలిసి యాగంటి క్షేత్రానికి దర్శనానికి వచ్చాడు. కోనేరులో స్నానమాచరించిన తర్వాత బోయ సురేంద్ర ఆలయ ఆవరణలో కుప్పకూలాడు. స్నేహితులు బనగానపల్లె వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ దుగ్గిరెడ్డి తెలిపారు.

రైల్వేలో ప్రశాంతంగా పోలింగ్ ప్రక్రియ

- మొదటి రోజు 50 శాతం నమోదు

కర్నూలు రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కర్నూలు సిటీ రైల్వేస్టేషన్‌లో గుర్తింపు సంఘం ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ ప్రక్రియ బుధవారం ప్రశాంతంగా జరిగింది. కర్నూలు రైల్వేస్టేషన్ పరిధిలో బోగోలు, వెల్దుర్తి, ఉల్లిందకొండ, దూపాడు, మానవపాడు స్టేషన్‌లు వస్తాయి. ఈస్టేషన్‌లలో పని చేస్తున్న రైల్వే ఉద్యోగులు, కార్మికులు కర్నూలు రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 452 మంది ఓటర్లు ఉండగా బుధవారం తొలి రోజు దాదాపు 50 శాతం పోలింగ్ నమోదైనట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. నేడు కూడా పోలింగ్ ప్రక్రియ కొనసాగనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. రన్నింగ్ ఉద్యోగులు ఓటు వేసేందుకు రేపు అవకాశం కల్పించారు. ఈ నెల 12న కౌంటింగ్ ప్రక్రియ చేపట్టనున్నట్లు వివరించారు. దేశవ్యాప్తంగా రైల్వే శాఖలో ఐదేళ్లకోసారి జరిగే గుర్తింపు సంఘం ఎన్నికల కోసం ఐదు కార్మిక సంఘాలు పోటీలో నిలిచాయి. అందులో ప్రధానంగా సౌత్‌సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్, సౌత్‌సెంట్రల్ రైల్వే నేషనల్ మజ్దూర్ యూనియన్ మధ్య తీవ్ర పోటీ నెలకొంది. హైదరాబాద్ నుంచి రైల్వే అధికారులు ఎన్నికల అధికారులుగా వ్యవహరించి పోలింగ్ ప్రక్రియ కొనసాగిస్తున్నారు.



రైల్వేస్టేషన్‌లో పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు

నంద్యాల జీజీహెచ్‌లో

డ్యూటీ రోస్టర్‌ను సవరించాలి

- ఏపీ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నంద్యాల గవర్నమెంటు జనరల్ హాస్పిటల్‌లో నర్సింగ్ సిబ్బంది డ్యూటీ రోస్టర్‌లో అవకతవకలు జరిగాయని, వెంటనే సవరించాలని ఉమ్మడి జిల్లా ఏపీ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ కోరింది. బుధవారం సాయంత్రం కర్నూలు జీజీహెచ్‌లో జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షురాలు ఎం.లీలావతి ఆధ్వర్యంలో జరిగింది. కర్నూలులో మెటర్నిటీ హాస్పిటల్‌ను ఏర్పాటు చేయాలని అసోసియేషన్ భవనాన్ని పునరుద్ధరించాలని నర్సులకు సిక్ రూం ఏర్పాటు చేయాలని సమావేశంలో సభ్యులు కోరారు. కర్నూలు జీజీహెచ్‌లో కూడా ఆరోగ్యం బాగాలేని సిక్ అయిన నర్సింగ్ సిబ్బందికి తేలిగ్గా ఉండే డ్యూటీలు వేయాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షురాలు జి. శాంతి భవాని, సెక్రటరీ సి.బంగారి, కోశాధికారి ఎస్.లక్ష్మీనరసమ్మ, ఈసీ సభ్యులు సోమేశ్వరి, యూఎం శాంతిలత, జే.ఉమారాణి, డి.కృష్ణవేణి, ఎ.ఉమాదేవి పాల్గొన్నారు.



జిల్లా కార్యవర్గంలో పాల్గొన్న సభ్యులు

10 నుంచి మైనార్టీ అభ్యర్థులకు

డీఎస్సీ ఉచిత శిక్షణ

నంద్యాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనార్టీస్ అమరావతి, రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఆదేశాల మేరకు నంద్యాలలో ఈ నెల 10నుంచి రెండు నెలలపాటు డీఎస్సీకి సిద్ధమవుతున్న మైనార్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జోయా కోచింగ్ డైరెక్టర్ అబ్దుల్ అజీజ్, రాజేశ్వరి కోచింగ్ డైరెక్టర్ గంగాధర్ బుధవారం తెలిపారు. మైనార్టీలోని ముస్లిం, క్రిస్టియన్ అభ్యర్థులు సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనార్టీస్ అమరావతి (సీఈడీఎం) దరఖాస్తు పత్రంతో సంబంధిత విద్యార్హత పత్రాలను జోడించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నంద్యాలలోని ముల్లాన్‌పేటలో ఉన్న జియా ఉర్దూ కోచింగ్, శ్రీనివాస సెంటర్‌లో ఉన్న రాజేశ్వరి కోచింగ్ సెంటర్‌లో దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. డిసెంబరు 10వ తేది సాయంత్రం 5గంటల్లోపు దరఖాస్తులు సమర్పించాలని, రెండు నెలల డీఎస్సీ ఉచిత శిక్షణాతరగతుల్లో ఎస్జీటీ అభ్యర్థులతోపాటు స్కూల్ అసిస్టెంట్ మైనార్టీ అభ్యర్థులకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. నూతన సిలబస్ ప్రకారం అభ్యర్థులకు మెటీరియల్ అందజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9059289076, 9110304693 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

గొలుసు దొంగల హల్‌చల్

కర్నూలు క్రైం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలో గొలుసు దొంగలు చెలరేగిపోయారు. బుధవారం తెల్లవారుజామున నిర్మానుష్యంగా ఉన్న కాలనీల్లో వృద్ధులే లక్ష్యంగా రెండు చోట్ల చైన్ స్నాచింగ్ చేశారు.

బాలాజీనగర్‌లో:

తాలుకా పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాలాజీనగర్‌లో బుధవారం తెల్లవారు జామున 5.30 గంటల ప్రాంతంలో నారాయణమ్మ అనే వృద్ధురాలు తన ఇంటి ముందు నిల్చుని ఉండగా.. నడుచుకుంటూ వచ్చిన ఓ యువకుడు ఆమె మెడలోని గొలుసును తెంపుకుని పరారయ్యాడు. అప్పటికే సమీపంలో ఉన్న మరో యువకుని ద్విచక్ర వాహనంపై ఎక్కి ఉడాయించాడు. అపహరణకు గురైన గొలుసు నాలుగున్నర తులాలు ఉంటుందని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.

నాగిరెడ్డి రెవెన్యూకాలనీలో...

బాలాజీనగర్‌లో స్నాచింగ్ చేసిన దుండగులు 6:30 గంటలకు నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలో స్నాచింగ్ చేశారు. రిటైర్డ్ ప్రిన్సిపాల్ చెంచమ్మ పాల దుకాణం నుంచి పాల ప్యాకెట్లు తీసుకుని వెళ్తుండగా.. ఇద్దరు బైక్‌పై వచ్చి ఆమె మెడలో నుంచి గొలుసు తెంపుకుని ఉడాయించారు. ఆయా స్టేషన్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'పేదలకు అండగా ప్రభుత్వం'



అల్లూరులో సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య, మాండ్ర శివానందరెడ్డి

నందికొట్కూరు రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే జయసూర్య, టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. మండలంలోని అల్లూరు గ్రామంలో మాండ్ర నివాసంలో మిడుతూరు మండలానికి చెందిన కడుమూరు గ్రామం జనార్దనరెడ్డి కుమార్తెకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి వచ్చిన రూ. 1,58,783 చెక్కును బుధవారం మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే జయసూర్య అందజేశారు. వారు మాట్లాడుతూ రాజకీయాలను పక్కన పెట్టి నియోజకవర్గ అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మాండ్ర సురేంద్రనాథరెడ్డి, కాతా రమేష్‌రెడ్డి నాయకులు కార్యకర్తలు, పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక: నాగంపల్లి గ్రామ వైసీపీ నాయకులు టీడీపీ కొత్తపల్లె మండల కన్వీనర్ నారపురెడ్డి, నాగేశ్వరారావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జయసూర్య సమక్షంలో టీడీపీలో చేరారు. అల్లూరులో మాండ్ర నివాసంలో వైసీపీ నాయకులు మద్దిలేటి, వెంకటేశ్వర్లు, చిన్న మస్తాన్, మోక్షేశ్వరుడు, సాంబశివుడు, కిష్టన్న, వెంకటనారాయణ, తదితరులతో పాటుగా మరికొంతమందికి ఎమ్మెల్యే జయసూర్య తెలుగుదేశం కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు వెంకటేశ్వర్లు, జంబులయ్య, లింగస్వామి పాల్గొన్నారు.

డీఎస్పీకి సన్మానం



డీఎస్పీని సన్మానిస్తున్న ఎస్పీ, ఏఎస్పీ, ఇతర అధికారులు

నంద్యాల క్రైం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా సాయుధ బలగాల డీఎస్పీ ఎం.శ్రీనివాసులు నంద్యాల జిల్లా నుంచి అన్నమయ్య జిల్లాకు బదిలీపై వెళుతున్న సందర్భంగా నంద్యాల ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, ఏఎస్పీ ఎన్.యుగంధర్‌బాబు, ఇతర పోలీస్ అధికారులు బుధవారం ఆయనను ఘనంగా సన్మానించారు. ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా మాట్లాడుతూ ఉద్యోగ జీవితంలో బదిలీలు అనేవి సర్వ సాధారణమన్నారు. డీఎస్పీ శ్రీనివాసులు నంద్యాలకు వచ్చినప్పటి నుంచి ఉన్నతాధికారులు చెప్పిన ప్రతి విషయాన్ని చాలా శ్రద్ధతో, నిబద్ధతతో పనిచేశారన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు డీఎస్పీ రామంజినాయక్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు నాగభూషణం, మంజునాథ్, శ్రీనివాసులు, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

'పనుల్లో నాణ్యత పాటించాలి'



పండ్ల తోటను పరిశీలిస్తున్న డ్వామా పీడీ జనార్దన్

గడివేముల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపడుతున్న గోకులాలు, సీసీ రోడ్లు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని డ్వామా పీడీ జనార్దన్ సూచించారు. మండలంలో జరుగుతున్న పనులను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల కేంద్రంలో హార్టికల్చర్ కింద సాగు చేసిన మామిడి తోటను, తిరుపాడు గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఉపాధిహామీ పథక సిబ్బందితో మండల పరిషత్ కార్యాలయంలో సమావేశమయ్యారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. ఎంపీడీవో వాసుదేవగుప్త, ఏపీవో వెంకటరమణ, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

శాశ్వత అన్నప్రసాద పథకానికి విరాళం

శ్రీశైలం, డిసెంబరు 4: శ్రీశైలం దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న శాశ్వత అన్నప్రసాద పథకానికి బుధవారం పల్నాడు జిల్లా, పిడుగురాళ్ళకు చెందిన చల్లా శ్రీనివాసరావు అనే భక్తుడు రూ. లక్ష విరాళాన్ని పర్యవేక్షకురాలు హిమబిందుకు అందజేశారు. అలాగే హైదరాబాద్‌కు చెందిన తుమ్మల సుశీల అనే భక్తురాలు రూ. లక్ష విరాళాన్ని పర్యవేక్షకుడు ఎం. మల్లికార్జునకు అందజేశారు. దాతకు దేవస్థానం అధికారులు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేసి సత్కరించారు.

'కళా ప్రదర్శనకు తరలిరండి'

మహానంది, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈనెల 11 వతేదిన గీతా జయంతి పురస్కరించుకొని అన్నమయ్య కళ క్షేత్ర పునరంకిత ఉత్సవాలు నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా అదేరోజు వేలామంది కళాకారులతో తిరుపతిలో నిర్వహించే కళా ప్రదర్శనకు అందరూ తరలిరావాలని అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయ శంకర స్వామి తెలిపారు. మహానందిలోని కళావేదిక వద్ద బుధవారం జానపద కళాకారుల, భజన బృందాల జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. .అనంతరం తిరుపతిలో ఈనెల 11 వతేది నిర్వహించే రాష్ట్ర స్థాయి కళాప్రదర్శన బ్రోచర్‌ను స్వామిజీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో భజన బృందాల సంఘం నాయకులు నల్లగట్ల వెంకటేశ్వర్లు, రామచంద్రుడు పాల్గొన్నారు.

పగిలిన పైపులైన్.. తాగునీరు వృథా

జూపాడుబంగ్లా, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జూపాడుబంగ్లాలో గ్రామానికి సరఫరా అయ్యే తాగునీటిపైపు జాతీయ రహదారి పనుల్లో పగిలిపోయి నీరు వృథాగా పోతున్నాయి. దీంతో జూపాడు బంగ్లాలోని ఎంపీడీవో కార్యా లయం నుంచి నాలుగు వార్డుల వరకు తాగునీటి ఇబ్బంది నెలకొంది. 10 రోజులైనా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించు కోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైపులైన్ మరమ్మతులు చేపట్టి తాగునీటిని అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



పైపులైన్ పగిలిపోవడంతో అండర్ పాస్ బ్రిడ్జి కింద వృథాగా పోతున్న తాగునీరు

వర్షపు నీరు నిల్వ



పాణ్యం అండర్ పాస్ బ్రిడ్జి కింద నిల్వ ఉన్న వర్షపు నీరు

పాణ్యం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పాణ్యంలో అండర్ పాస్ బ్రిడ్జి కింద వర్షపు నీరు నిల్వ ఉండడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బనగానపల్లె, అనంతపురం, బెంగుళూరు, తదితరప్రాంతాలనుంచి చెన్నై, తిరుపతి, కాకినాడ, విజయవాడ తదితర ప్రాంతాలకు వాహనాలు ఈ బ్రిడ్జి కిందే వెళ్తుంటాయి. కాగా వర్షం వస్తే దీని కింద నీరు చేరి దాదాపు వారం రోజులు పాటు మురుగు నిల్వతో దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో పరిసరాల ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. వ్యవసాయ పనులకు, ఇతర ప్రాంతాలకు వెళ్లే పాదచారులు. నిత్యం కళాశాలలకు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఈ నీటితో తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు.

త్వరలో అంత్యక్రియలకు కైలాస వాహనం

- శ్రీశైలంలో ఇకపై ఖననం నిషేధం
- ఈవో ఎస్ఎస్ చంద్రశేఖర్ ఆజాద్

శ్రీశైలం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానం తరఫున అంత్యక్రియల కోసం కైలాస వాహనాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఈవో ఎస్ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ తెలిపారు. వాహనాన్ని ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్, పారిశుధ్య విభాగాధిపతులను ఆదేశించారు. శ్రీశైల క్షేత్ర పరిధిలోని నివాసితులలో మరణించిన పార్థివదేహాలను గౌరవప్రదమైన రీతిలో అంతిమ సంస్కారాలను జరిపేందుకు, అంత్యక్రియలలో శ్మశానానికి చేర్చేందుకు ఈ ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కాగా కైలాసవాహనం ఏర్పాటు అయ్యే వరకు కేవలం అంత్యక్రియలకు మాత్రమే వినియోగించేందుకు నూతనంగా ట్రాక్టర్‌ను ఏర్పాటు చేయాలని దేవస్థానం రవాణా విభాగాన్ని ఆదేశించారు. దేవస్థానం అనాథప్రేత సంస్కరణలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వాటి అంతిమ సంస్కరణలు గౌరవప్రదంగా, స్థానిక పోలీసు, రెవెన్యూ వారి సమక్షంలో పంచనామా జరిపించిన తరువాత పురోహితుడిని ఏర్పాటు చేసి మంత్రపూర్వకంగా దేవస్థానం నిధులతో దహన కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. శవదహనానికి దేవస్థానం డంప్‌యాడ్ సమీపంలో 50 సెంట్ల స్థలంలో స్మశానాన్ని ఏర్పాటు చేసి, దహనానికి గ్యాస్ క్రిమిటోరియం, చితాభస్మాన్ని భద్రపరిచే గది, స్నానాలు ఆచరించే సదుపాయం, విద్యుత్ సౌకర్యం తదితర సౌకర్యాలతో ఏర్పాటు చేయాలని చెప్పారు. అదేవిధంగా దేవస్థానం పరిధిలో పేద యాత్రికులు ఎవరైనా మరణిస్తే పార్థివదేహాన్ని వారి బంధువుల సూచనమేరకు వారి స్వస్థలాలకు ఉచితంగా చేర్చాలన్నారు. దేవస్థానం పరిధిలో మరణించిన వారిని క్షేత్రపరిధిలో ఇకపై దహనం మాత్రమే చేయాలని, ఖననం శాశ్వతంగా నిషేధించినట్లు తెలిపారు.

అంత్యక్రియలకు వచ్చి కేసీలో గల్లంతు

పాములపాడు డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): బంధువు అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వచ్చి కేసీ కెనాల్‌లో యువకుడు గల్లంతయ్యాడు. మండలంలోని కంబాలపల్లి గ్రామానికి చెందిన సూర్యనారాయణ అనే వ్యక్తి చనిపోవడంతో బుధవారం అంత్యక్రియలకు తెలంగాణ రాష్ట్రం గద్వాల జిల్లా మనోపాడు గ్రామానికి చెందిన కురువ మధు అనే యువకుడు వచ్చాడు. అంత్యక్రియల అనంతరం గ్రామ సమీపంలోని కేసీ కెనాల్‌లో స్నానానికి దిగి గల్లంతైనట్లు బంధువులు తెలిపారు. గ్రామస్థులు, బంధువులు గాలింపు చర్యలు చేపట్టారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

గడివేముల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గని గ్రామానికి చెందిన శివలక్ష్మి(30) చికిత్స పొందుతూ ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. శివలక్ష్మి అనారోగ్యంతో బాధపడుతూ నవంబరు 29న పురుగుల మందు తాగారు. గమనించిన బంధువులు చికిత్స నిమిత్తం కర్నూలులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అయితే కోలుకోలేక మృతి చెందినట్లు తెలిపారు. మహిళ తండ్రి ఫిర్యాదు మేరకు కేసుదర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆత్మకూరు అర్బన్ సీఐగా రాము బాధ్యతలు



ఆత్మకూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు అర్బన్ సీఐగా డి.రాము బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ అర్బన్ సీఐగా పనిచేస్తున్న ఓబులేసు కడపలోని చిన్నచౌక్ సీఐగా బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో నంద్యాల వీఆర్‌లో ఉన్న రాము ఆత్మకూరు అర్బన్ సీఐగా ఇక్కడికి వచ్చారు. గతంలె పాములపాడు, నందికొట్కూరు పోలీసు స్టేషన్లలో ఎస్సై పని చేశారు. బాధ్యతలు చేపట్టిన ఆయన ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పోలీసు సేస్టేషన్ సిబ్బంది సీఐని కలిసి పరిచయం చేసుకున్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

కొత్తపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తు న్నట్లు ఎంపీడీవో మేరీ తెలిపారు. ఎంపీపీ కిచ్చన్నగారి కుసుమలత అధ్యక్షతన ఈ సమావేశం ఉంటుందని చెప్పారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే గిత్తా జయసూర్య హాజరు అవుతారని తెలిపారు.

'అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలి'

పాములపాడు డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హైవే నిర్మిస్తుండటంతో గ్రామంలోని ప్రజలు, పొలాలకు వెళ్లే రైతులు ఇబ్బందులు పడకుండా అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలని టీడీపీ నాయకుడు చెల్లె బాలీశ్వరరెడ్డి కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నేషనల్ హైవే పనులు ఎర్రగూడూరు గ్రామం మధ్యలో నిర్మాణం చేపడుతున్నారు. దీంతో అవతలి వైపున ఉన్న బీసీ కాలనీ, తండాలు ఉన్నాయన్నారు. నిత్యం పొలాలకు వెళ్లాల్సి ఉంటుందని, ఈ గ్రామంలో అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మించాలని హైవే అధికారులను కోరినట్లు తెలిపారు. ఈ విషయం నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి దృష్టికి కూడా తీసుకెళ్లామని చెప్పారు. గ్రామస్థులు ఇబ్బందులు పడకుండా అన్ని గ్రామాలలో నిర్మించిన విధంగా ఎర్రగూడూరు గ్రామంలో కూడా అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మించాలని ఆయన కోరారు.

నేడు సంతజూటూరులో ధర్నా

బండిఆత్మకూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): వరి ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ సంతజూటూరు బస్టాండ్‌లో గురువారం ధర్నా చేపట్టనున్నట్లు మండల రైతు సంఘం నాయకుడు సుధాకర్‌రెడ్డి బుధవారం తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు రైతులతో కలసి గిట్టుబాటు ధర, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతూ ధర్నా చేపట్టామని చెప్పారు. రైతులు, కౌలు రైతులు అధిక సంఖ్యలో పాలొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

10 నుంచి మైనార్టీ అభ్యర్థులకు డీఎస్సీ ఉచిత శిక్షణ

నంద్యాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనార్టీస్ అమరావతి, రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఆదేశాల మేరకు నంద్యాలలో ఈ నెల 10నుంచి రెండు నెలలపాటు డీఎస్సీకి సిద్ధమవుతున్న మైనార్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జోయా కోచింగ్ డైరెక్టర్ అబ్దుల్ అజీజ్, రాజేశ్వరి కోచింగ్ డైరెక్టర్ గంగాధర్ బుధవారం తెలిపారు. మైనార్టీలోని ముస్లిం, క్రిస్టియన్ అభ్యర్థులు సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనార్టీస్ అమరావతి (సీఈడీఎం) దరఖాస్తు పత్రంతో సంబంధిత విద్యార్హత పత్రాలను జోడించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నంద్యాలలోని ముల్లాన్‌పేటలో ఉన్న జియా ఉర్దూ కోచింగ్, శ్రీనివాస సెంటర్‌లో ఉన్న రాజేశ్వరి కోచింగ్ సెంటర్‌లో దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. డిసెంబరు 10వ తేది సాయంత్రం 5గంటల్లోపు దరఖాస్తులు సమర్పించాలని, రెండు నెలల డీఎస్సీ ఉచిత శిక్షణాతరగతుల్లో ఎస్జీటీ అభ్యర్థులతోపాటు స్కూల్ అసిస్టెంట్ మైనార్టీ అభ్యర్థులకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం సీఈడీఎం రూపొందించిన ఉచిత డీఎస్సీ స్టడీ మెటీరియల్ నూతన సిలబస్ ప్రకారం అభ్యర్థులకు అందజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9059289076, 9110304693 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

'మద్దూరు సుబ్బారెడ్డి సేవలు మరువలేనివి'



మద్దూరు సుబ్బారెడ్డికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే

నందికొట్కూరు రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మాజీ ఎంపీ, జడ్పీ మాజీ ఛైర్మన్ మద్దూరు సుబ్బారెడ్డి నందికొట్కూరు నియోజకవర్గానికి, పేద ప్రజలకు చేసిన సేవలు మరువలేనివి అని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. బ్రాహ్మణకొట్కూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మద్దూరు సుబ్బారెడ్డి జయంతిని సింగిల్ విండో మాజీ ఛైర్మన్ మద్దూరు హరిసర్వోత్తమరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జయసూర్య విచ్చేశారు. మద్దూరు సుబ్బారెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. మాండ్ర సురేంద్రనాథరెడ్డి, జడ్పీటీసీ కరీమున్నిసా, వీరం ప్రసాదరెడ్డి, కాతా రమేష్‌రెడ్డి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, ఖలీలుల్లాబేగ్ నాయకులు, కార్యకర్తలు, జనసేన నాయకుడు రామిరెడ్డి పాల్గొన్నారు. బ్రాహ్మణకొట్కూరు గ్రామంలోనే అబ్దుల్ రషీద్‌కు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి వచ్చిన రూ 1,00,280 ల చెక్కును ఎమ్మెల్యే జయసూర్య అందజేశారు.

హిందువుల ర్యాలీ



ర్యాలీ చేస్తున్న హిందూ సంఘాలు నాయకులు

నంద్యాల కల్చరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న అత్యాచారాలు దాడులకు నిరసనగా నంద్యాలలో బుధవారం సాయంత్రం భారీ ర్యాలీ చేపట్టారు. విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్, సంఘ్ పరివార్, బీజేపీ అనుబంధ సంస్థలు, హిందూ పరిరక్షణ సంస్థలు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీ టెక్కె భారతమాత గుడి నుంచి గాంధీచౌక్ వరకు భారీ ర్యాలీ ని నిర్వహించారు. బంగ్లాదేశ్ ప్రభుత్వం అరెస్ట్ చేసిన చిన్మయదాస్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు. బీజేపీ జిల్లా కోఆర్డినేటర్ అభిరుచి మధు, ఇనుగూరి రమేష్, పోలేపల్లి సందీప్, ఆర్ఎస్ఎస్ సంఘం నాయకులు, బీజేపీ అనుబంద సంస్థలు, హిందూ సంస్థలు, సంఘ్‌పరివార్‌సంస్థలు, భారీఎత్తున హిందువులు పాల్గొన్నారు.

'నేటి నుంచి ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు'

నంద్యాల రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంతో పాటు పరిసరాలలోని మహానంది, బండిఆత్మకూరు, పాణ్యం, వెలుగోడు మండలాలకు విద్యుత్ సరఫరా చేసే ప్రధాన ట్రాన్స్‌ఫార్మర్లకు గురువారం నుంచి 15 వతేది వరకు అత్యవసర మరమ్మతులు చేపట్టనున్నట్లు నంద్యాల పట్టణ, రూరల్ ఏడీఈలు రమేష్‌కుమార్, సుబ్రమణ్యం తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ నంద్యాల పట్టణ సమీపంలోని బొమ్మలసత్రం విద్యుత్ సబ్ స్టేషన్‌లోని ట్రాన్స్‌ఫార్మర్లకు అత్యవసర మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు. బొమ్మలసత్రం విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని 220, 132, 33 కేవీ పవర్ ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేపడుతున్నామన్నారు. మరమ్మతుల సమయంలో విద్యుత్‌ను సర్దుబాటు చేయనున్నట్లు తెలిపారు. ఒకవేళ అత్యవసర పరిస్థితులలో విద్యుత్ అంతరాయం ఏర్పడితే ఆయా మండలాల వినియోగదారులు సహకరించాలన్నారు.

'ఉపాధ్యాయ డిమాండ్లను నెరవేర్చాలి'

పాణ్యం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గిరిజన గురుకుల పాఠశాలల ఉపాధ్యాయుల డిమాండ్లను నెరవేర్చాలని ఏపీ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గత 18 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన గిరిజన గురుకులాల పాఠశాలల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు సమ్మెతో విద్యార్థుల చదువుకు అంతరాయం ఏర్పడే పరిస్థితి ఉందన్నారు. ఉమ్మడి జిల్లాలోని తొమ్మిది పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు పాఠాలు చెప్పేవారు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పొరుగు సేవల ఉపాధ్యాయులను ఒప్పంద ఉద్యోగులుగా గుర్తించి వేతనాలు పెంచాలన్నారు. 2017లో అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు వేతనాలు పెంచినా, ఆ తర్వాత అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం పెంచలేదన్నారు. సమ్మెతో విద్యార్థుల పాఠ్యాంశాలు ముందుకు సాగడంలేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు.

'ఆలయాల పనులు త్వరగా పూర్తి చేయాలి'



నారాయణాపురంలో ఆలయ ఎనులను పరిశీలిస్తున్న డీఈఈ

బండిఆత్మకూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆలయ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని దేవదాయశాఖ డీఈఈ ఎం శ్రీనివాస ప్రసాద్ సూచించారు. నారాయణపురం గ్రామంలో రూ.1.25 కోట్లతో నిర్మిస్తున్న ఆంజనేయ, నారాయణస్వామి ఆలయ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. సిబ్బంది నాగరాజు పాల్గొన్నారు.

శ్రీశైలంలో పూజలు

శ్రీశైలం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానంలో బుధవారం లోకకల్యాణార్థం సాక్షిగణపతికి, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేష అభిషేక పూజలు నిర్వహించారు. అభిషేకాన్ని పంచామృతాలతోనూ, పలుఫలోదకాలతోనూ, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలాలతో అభిషేకాన్ని చేశారు. అనంతరం విశేష పుష్పార్చన, నివేదన కార్యక్రమాలు నిర్వహించారు.

నిత్యకళారాధన: దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో బుధవారం సాయంత్రం మేడ్చల్‌కు చెందిన ఊహిత మ్యూజిక్ అకాడమీ బృందంతో సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో గణనాయకా శరణు, మూషిక వాహన, మహిషాసురమర్దిని, లింగాష్టకం, శంకర శ్రీగిరి, శివతాండవస్తోత్రం మొదలైన రామారావు, రమేష్, జ్ఞానేశ్వర్, రమేష్‌బాబు, విజయలక్ష్మీ, శ్రీదేవి, మంజుల, లీలాశృతి, లక్ష్మీజ్యోత్స్న, ప్రియాంక తదితరులు నృత్య ప్రదర్శనతో అలరించారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

జూపాడుబంగ్లా, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం నుంచి రెవెనన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్ తెలిపారు. ఈనెల 6న మండ్లెం, 10న పారుమంచాల, 13న తాటిపాడు, 17న 80బన్నూరు, 20న తూడిచర్ల, 27న తర్తూరు, 31న తంగడంచ, 2025 జనవరి 2న పోతులపాడు, 4న తరిగోపుల, 8న లింగాపురం గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

వెలుగోడు: ఈ నెల 6 నుంచి జనవరి 4వ తేదీ వరకు వెలుగోడు మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసగౌడ్, డీటీ చంద్రశేఖర్ తెలిపారు. వారు మాట్లాడుతూ ఈ నెల 6న వెలుగోడు, 10న వేల్పనూరు, 13న మోతుకూరు, 17న మాధవరం, 19 తిమ్మనపల్లి, 21న అబ్దుల్లాపురం, 24న గుంతకందాల, 26న రేగడగూడూరు, 28న గట్టు తాండ, జనవరి 2న బోయరేవుల, 4న అయ్యవారిపల్లెలో ఈ సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఆత్మకూరు రూరల్: ఈ నెల 6వ తేదీ నుంచి జనవరి 7వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రత్నరాధిక తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ డిసెంబరు 6న ఇందిరేశ్వరం గ్రామంలో, 10న కురుకుందలో, 13న ఆత్మకూరులో, 17న వడ్లరామాపురంలో, 18న కరివేనలో, 20న పిన్నాపురంలో, 26న సిద్ధాపురంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే జనవరి 2న సిద్ధపల్లిలో, 4న నల్లకాల్వలో, 7న కృష్ణాపురం గ్రామాల్లో ఈ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వెల్లడించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష

నంద్యాల క్రైం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఓ వ్యక్తికి న్యాయస్థానం 15రోజులు జైలు శిక్ష విధించినట్లు టూ టౌన్ సీఐ ఇస్మాయిల్ తెలిపారు. బుధవారం నంద్యాల పట్టణంలోని పద్మావతినగర్ సమీపంలో సిబ్బందితో కలిసి డ్రంకెన్‌డ్రైవ్ చేపట్టగా మద్యం సేవించి వాహనం నడుపుతున్న పట్టణంలోని వెంకటాచలం కాలనీకి చెందిన పామన్నగారి నరసింహులు అనే వ్యక్తి పట్టుబడ్డాడని సీఐ పేర్కొన్నారు. అతడిపై కేసు నమోదు చేసి చార్జిషీట్ దాఖలు చేసి నంద్యాల సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఆర్.రామభూపాల్‌రెడ్డి ఎదుట హాజరు పరచగా ముద్దాయికి 15రోజులు జైలు శిక్ష విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని సీఐ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడపడం చట్టరీత్యానేరమన్నారు. మద్యం సేవించి వాహనం నడపడంవల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి మరణించే అవకాశం ఉంటుందని, అందువల్ల ఎవరూ మద్యం సేవించి వాహనాలు నడపరాదని పేర్కొన్నారు.

'న్యాస్' పరీక్ష పరిశీలన

పాణ్యం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యా పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో బుధవారం పాణ్యం మండలంలో నిర్వహించిన న్యాస్ (నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే) పరీక్షకు 109 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈవో కోటయ్య తెలిపారు. పరీక్షలను ఎంఈవో పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 సుబ్రహ్మణ్యం, సీఆర్పీలు రాజశేఖర్, శ్రీహరి, ఫీల్డ్ ఇన్విజిలేటర్లు, అబ్జర్వర్లు పాల్గొన్నారు.

రాయితీపై సోలార్ కనెక్షన్లు

వెలుగోడు డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాయితీపై సోలారును అందచేస్తున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన కింద గృహ వినియోగదారులకు రాయితీపై ఈ స్కీం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపికచేసి ఈ పథకం అమలు చేయనున్నట్లు తెలిపారు. ఇందులో బాగంగ వెలుగోడు మండలంలోని వేల్పనేరు గ్రామాన్ని ఎంపిక చేసినట్లు చెప్పారు.

'గ్రామంలో చిచ్చు పెట్టొద్దు'

కొత్తపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రశాంతంగా ఉన్న ఎర్రమటం గ్రామంలో పశువుల బండెలదొడ్డి విషయంలో చిచ్చు పెట్టాలని చూస్తున్నారని సర్పంచ్ బాల ఎల్లయ్య, గ్రామ పెద్దలు చంద్రమౌళీశ్వరరెడ్డి, మధుసూదన్ రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, తెలుగు హుశేన్, సీలం వేదమూర్తి, దుబ్బ మద్దిలేటి ఆరోపించారు. మొదటి నుంచి పశువుల బండెలదొడ్డి అన్ని వర్గాల పెద్ద మనుషుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయితే కొన్ని వర్గాలకు చెందిన కొందరు వ్యక్తులు.. బండెలదొడ్డి నిర్వహణ మేమే నిర్వహిస్తామని వాగ్వాదానికి దిగుతున్నారన్నారు.

'జియో ట్యాగింగ్‌ను వేగవంతం చేయాలి'

పాములపాడు డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో హౌసింగ్ జియో ట్యాగింగ్‌ను సచివాలయ సిబ్బంది వేగవంతం చేయాలని ఎంపీడీవో చంద్రశేఖర్ సూచించారు. మండలం లోని వాణాల, మద్దూరు గ్రామాల సచివాలయాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. రిజిస్టర్లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

'కొలతల ప్రకారం షెడ్లు నిర్మించుకోవాలి'

పాములపాడు డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): అధికారులు సూచించిన కొలతల మేరకు గోకులం షెడ్లను నిర్మించుకోవాలని జాతీయ ఉపాధి హామీ ఏపీవో విమలమ్మ లబ్ధిదారులకు సూచించారు. మండలంలోని క్రిష్ణానగర్, మద్దూరు గ్రామాల్లో నిర్మిస్తున్న గోకులం షెడ్లను బుధవారం పరిశీలించారు.

'కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి'



ప్రాతకోటలో వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

పగిడ్యాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన వరి ధాన్యానికి మద్దతు ధర కల్పించి, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కన్వీనర్ పక్కీర్ సాహెబ్ డిమాండ్ చేశారు. ప్రాతకోట గ్రామంలో రైతులు కళ్లాలలో ఆరబోసుకున్న ధాన్యాన్ని బుధవారం సీపీఎం నాయకులు పరిశీలించారు. దళారులు తక్కువకు కొనడంతో రైతులకు పెట్టుబడి ఖర్చులు కూడా రావడం లేదని అన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



అయ్యప్పస్వామికి పూజ చేస్తున్న వీఆర్ లక్ష్మీరెడ్డి

కొలిమిగుండ్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కనకాద్రిపల్లె గ్రామంలో వెలసిన అయ్యప్పస్వామి ఆలయంలో 9వ ఆలయ వార్షికోత్సవ వేడుకలను బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఆవరణంలో ప్రత్యేక హోమాలు, మెట్ల పూజ, అభిషేకాలు, అన్నదానం, స్వామి వారి గ్రామోత్సవం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ బనగానపల్లె నియోజకవర్గ సమన్వయ కర్త వీఆర్ లక్ష్మీరెడ్డి, సర్పంచ్ శివశంకర్, మాజీ సర్పంచ్‌లు ఓబులేసు, రామలక్ష్మణ్ణ, పెద్దిరెడ్డి, వెంకటమల్లారెడ్డి, గురుస్వామి చంద్రమోహన్‌గౌడ్, సుబ్బరాయుడు తదితరులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైసీపీ తాడిపత్రి నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి వీఆర్ రామిరెడ్డి, అయ్యప్పలు, మహిళలు పాల్గొన్నారు.

'రైతుల దరఖాస్తులను పరిశీలించండి'

రుద్రవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రీసర్వే జరిగిన గ్రామాల్లో గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలని జిల్లా సర్వే ఆఫీసరు జయరాజ్ అన్నారు. బుధవారం తహసీల్దారు కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రీసర్వేలో జరిగిన తప్పు ఒప్పులు సరిచేసి రైతులకు న్యాయం చేయాలన్నారు. రుద్రవరం మండలంలో రీసర్వే జరిగిన 8 గ్రామాల్లో 1692 దరఖాస్తులను రైతుల నుంచి స్వీకరించినట్లు తెలిపారు. రైతులతో శాంతంగా మాట్లాడి పరిష్కరించాలన్నారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే శ్రీరామమోహన్, డివిజనల్ సర్వేయరు వెంకటచెన్నయ్య, తహసీల్దారు మల్లిఖార్జునరావు, సర్వేయరు రమణ, డీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

సోలార్ రూఫ్ ఏర్పాటు చేసుకోవాలి

రుద్రవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అమలు ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకొని విద్యుత్ బిల్లులు తగ్గించుకోవాలని డిప్యూటీ డీఈ రవికాంత్ చౌదరి అన్నారు. బుధవారం రుద్రవరం సబ్‌స్టేషన్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆళ్లగడ్డ సబ్ డివిజనులో సోలార్ యూనిట్‌గా గోవిందపల్లెను ఎంపిక చేశామన్నారు. సబ్ డివిజనులో 39వేల కనెక్షన్లు ఉండగా 10వేలు సోలార్ రూఫ్ కనె క్షన్లు లక్ష్యంగా ఉందన్నారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

కోవెలకుంట్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 6 నుంచి రెవెన్యూ సదస్సులు ప్రారంభం అవుతున్నట్లు ఎస్ఆర్‌బీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు రాంభూపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం కోవెలకుంట్ల తహసీల్దారు కార్యాయలంలో రెవెన్యూ అధికారులతో స్పెషల్ కలెక్టరు సమావేశం నిర్వహించారు. సమావేశంలో తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి, డీటీ శ్రీనివాసులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలు లేబర్ కార్డులు తీసుకోవాలి

బనగానపల్లె , డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కార్మికులు ఈ శ్రమ్ పోర్టల్లో అసంఘటిత కార్మికులు తమ పేర్లను నమోదు చేసుకొని లేబర్ కార్డులు పొందాలని బనగానపల్లె అసిస్టెంట్ లేబర్ అధికారి శోభారాణి కోరారు. బుధవారం ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో ఎంపీడీవో రమణ, టెక్నికల్ అసిస్టెంట్ మగ్బుల్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకంలో పనిచేసే ఫీల్డ్ అసిస్టెంట్లకు అవగాహన సదస్సు నిర్వహించారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

- జిల్లా వ్యవసాయాధికారి డాక్టర్ వైవీ మురళీకృష్ణ
- పండ్లాపురంలో నేలవాలిన పంట పొలం పరిశీలన

బనగానపల్లె , డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రసాయనిక ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి డాక్టర్ వైవీ మురళీకృష్ణ హెచ్చరించారు. బుధవారం బనగానపల్లెలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో నంద్యాల వ్యవసాయ సహాయ సంచాలకులు రాజశేఖర్, మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డితో కలసి పాల్గొన్నారు. బనగానపల్లె పట్టణంలోని పవన్‌ఫర్టిలైజర్స్, సత్యం కెమికల్స్ ఫర్టిలైజర్ దుకాణాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఎమ్మార్పీ ధరలకు పురుగు మందుల అమ్మకాలు జరుపాలని ఎవరైనా అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గుండ్ల శింగవరం రైతులు ఫిర్యాదు మేరకు బనగానపల్లెలో ఉన్న లలితాట్రేడర్స్ దుకాణాన్ని తనిఖీ చేశారు. విత్తనం ఎంపిక చేసుకునేటప్పుడు సరైన నవిగా గుర్తించి రైతులు మొక్కజొన్న విత్తనాలను కొనుగోలు చేయాలని రైతులు వివరించారు. నకిలీ విత్తనాలు అమ్మితే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బనగానపల్లె మండలంలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న వ్యవసాయ సిబ్బందితో సమావేశం నిర్వహించి క్షేత్రస్థాయిలో వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పంటల బీమాను ఈనెల 15లోగా చేయించాలన్నారు. రబీ పంట నమోదు చేయాలని ఆదేశించారు. దెబ్బతిన్న పంట పొలాల ను ఆయన పరిశీలిం చారు. మండలంలోని పండ్లాపురం గ్రామంలో రెండు రోజుల క్రితం కురిసిన వర్షం వల్ల నేలవాలిన వరిపంటను జిల్లా వ్యవసాయాధికారి, ఇతర అధికారులు పరిశీలించారు. ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలిపారు. వ్యవసా య శాఖ ద్వారా అమ లవుతున్న వివిధ పథకాల గురించి రైతులకు ఆయన బనగానపల్లెలో నిర్వహించిన రైతు సదస్సులో వివరించారు. రైతులు పండించే పంటల దిగుబడి పెంచడానికి సలహాలు, సూచనలు రైతులకు ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



పండ్లాపురంలో నేలవాలిన పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారి మరళీకృష్ణ

రసాభాసగా కౌన్సిల్ సమావేశం

డోన్ రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణం లోని మున్సిపల్ కార్యాలయంలో బుధ వారం మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ సమావేశం రసాభాసగా సాగింది. మున్సిపల్ అధికారులు ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని పలువురు వైసీపీ కౌన్సిలర్లు కౌన్సిల్ సమావేశంలో ధ్వజమెత్తారు. డోన్ మున్సిపల్ కమిషనర్‌పై వైసీపీ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషనర్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. రెండు నెలల క్రితం మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి వాకింగ్ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్యాలయం వద్దకు వస్తే.. గేటుకు తాళాలు వేసి అవమానపరిచారంటూ పలువురు వైసీపీ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే.. టీడీపీకి చెందిన మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషన్ మాట్లాడుతూ ఉద్దేశ పూర్వకంగా మున్సిపల్ అధికారులు గేటుకు తాళం వేయలేదన్నారు. ఇరువురి మధ్య వేడివేడిగా మాటల వాగ్వివాదం సాగింది. సీపీఐ పార్టీకి చెందిన కౌన్సిలర్ సుంకయ్య మాట్లాడుతూ డోన్‌లో భగత్ సింగ్ విగ్రహం ఏర్పాటుకు వినతులు ఇచ్చినా జీవోల పేరుతో కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో కమిషనర్ ప్రసాద్‌గౌడు, మున్సిపల్ వైస్ చైర్మన్ హరికిషన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రాజేష్



సమావేశంలో మాట్లాడతున్న సీపీఐ కౌన్సిలర్ సుంకయ్య

ఉపాధ్యాయులపై ఆంక్షలు తగదు: యూటీఎఫ్

డోన్ రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు పది శాతం మించి సెలవులు పెట్టరాదన్న ఆంక్షలు తగదని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు లక్ష్మీనాయక్, ప్రధాన కార్యదర్శి గోపాల్, జిల్లా సాంస్కృతిక కన్వీనర్ సంజీవరాయుడు అన్నారు. బుధవారం సాయంత్రం మండల విద్యాధికారి ప్రభాకర్‌ను కలిసి యూటీఎఫ్ నాయకులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా రైల్వే యూనియన్ల ఎన్నికలు

డోన్ రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణం రైల్వే స్టేషన్‌లో బుధవారం రైల్వే యూనియన్ల ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ ఎన్నికలకు డోన్ పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఓటింగ్ జరిగే కేంద్రాల వద్ద డ్రోన్ కెమెరాను ఏర్పాటు చేశారు. 646 మంది రైల్వే కార్మికులకు గానూ బుధవారం 291 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు రైల్వే అధికార వర్గాలు తెలిపాయి.

డోన్ సబ్ జైలు తనిఖీ

డోన్ రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): డోన్ సబ్ జైలును బుధ వారం కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ది తనిఖీ చేశారు. డోన్‌కు వచ్చిన జిల్లా న్యాయాధికారి డోన్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణు గోపాల్ గౌడు ఆధ్వర్యంలో న్యాయవాదులు స్వాగతం పలికారు. జిల్లా న్యాయాధికారి నూతనంగా నిర్మిస్తున్న కోర్టు భవనాల నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించారు. అలాగే ప్రస్తుతం ఉన్న సబ్ కోర్టు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జూనియర్ సివిల్ న్యాయాధికారి కోర్టులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట డోన్ సబ్‌కోర్టు సీనియర్ సివిల్ న్యాయాధికారి తంగమణి, డోన్ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి రాహుల్ అంబేడ్కర్, ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జ్యోతి తదితరులు ఉన్నారు.



నూతనకోర్టు నిర్మాణ భవన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జిల్లా న్యాయాధికారి జి.కబర్ది

పశు గ్రాసం సాగు పథకంపై అవగాహన కల్పించాలి

బనగానపల్లె , డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పశు గ్రాస సాగు పథకంపై రైతులకు అవగాహన కల్పించాలని పశువైద్యశాఖ ఉపసంచాలకులు డాక్టర్ డీవీ. రమణయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రమైన బనగానపల్లె పశు వైద్యశాలలో వ్యవసాయశాఖ సంచాలకులు డాక్టర్ మారుతిసకారం ఆధ్వర్యంలో పశువైద్య అధికారులు, సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పశువైద్య అధికారులు డాక్టర్ బ్రహ్మానందారెడ్డి, డాక్టర్ రాంకుమార్‌రెడ్డి, డాక్టర్ రాఘవేంద్రారెడిడ, డాక్టర్ చిన్నబాబు, డాక్టర్‌శ్రీకాంత్‌రెడ్డి, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సిమెంటు నగర్‌లో టీడీపీ సభ్యత్వం

బేతంచెర్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని సిమెంటు నగర్‌లో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు రాముడు మాట్లాడుతూ కార్యకర్తలు రూ.100లు చెల్లించి సభ్యత్వం చేయించుకోవాలన్నారు. సభ్యత్వం నమోదు చేయించుకోవడం వల్ల రూ.5లక్షలు బీమా సౌకర్యం వర్తిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి సీపీ రాముడు, బూత్ ఇన్‌చార్జిలు వాసు, వెంకటేశ్వర్లు, ఆనంద్, మాబు, సుబాని, సుంకయ్య, రాజు, చంద్ర పాల్గొన్నారు.

సంజామల: తెలుగుదేశం పార్టీ సభ్యత్వాలు పొందిన ప్రతి ఒక్కరికీ టీడీపీ అండగా ఉంటుందని టీడీపీ నాయకులు తిమ్మయ్య, వెంకటేశ్వర రెడ్డి, పుల్లారెడ్డి, మదన్ అన్నారు. బుధవారం ఆకుమళ్ల గ్రామంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ బెల్లం కిరణ్ కుమార్, గొల్ల వెంకటేశ్వరరావు, సులేమాన్, శ్రీరామ సుధాకర్, బుచ్చిరెడ్డి, సోమయ్య, అబ్రహాం పాల్గొన్నారు.

డోన్‌లో చిరు వ్యాపారుల ఆందోళన

డోన్ రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తారకరామనగర్, ఇందిరానగర్, కొండపేట తదితర కాలనీలకు చెందిన గంపలలో పూలు అమ్ముకుంటున్న మహిళా చిరు వ్యాపారులు బుధవారం రోడ్డెక్కి ఆందోళనకు దిగారు. డోన్ పట్టణం రైల్వేగేట్ల ప్రాంతంలో ఉన్న పూలమార్కెట్ వద్ద పాతపద్ధతిలోనే తమకు తూకాలు కావాలని కోరుతూ ఆందోళనకు దిగారు. అనంతరం పట్టణ పోలీసులు జోక్యం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి వారికి ఎలక్ట్రానిక్ డిజిటల్ కాటాపై అవగాహన కల్పించారు. పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా డెమో నిర్వహించి ఎలక్ట్రానిక్ కాటా వల్ల ఎటువంటి నష్టాలు ఉండవని వివరించారు. డోన్ పూలమార్కెట్‌లో వ్యాపారులు డిజిటల్ కాటాను పూల కొనుగోలు అమ్మకాలకు ఉపయోగించాలని ఆయన స్పష్టం చేశారు.

మతసామరస్యానికి ప్రతీక భారతదేశ సంస్కృతి

- హిందువుల భారీ ర్యాలీ



మాట్లాడుతున్న హిందూ పరిరక్షణ వేదిక సభ్యుడు నాగమోహన్

బేతంచెర్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): భారతదేశ సంస్కృతి మతసామరస్యానికి ప్రతీక అని హిందూ పరిరక్షణ వేదిక సభ్యులు నాగమోహన్, రామ్మూర్తి, గూని నాగరాజు పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం హిందూ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని ఆంజనేయస్వామి దేవాలయం నుంచి మెయిన్ బజారు గుండా హిందువుల భారీ ర్యాలీ పాతబస్టాండుకు చేరుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ బంగ్లాదేశ్ నుంచి భారతదేశాన్ని కాపాడాలని, హిందువులపై దాడులు జరగకుండా చూడాలని కోరారు. హిందు ముస్లిం సోదరుల ఐకమత్యంతో భారతదేశ సంస్కృతిలో కలిసిమెలిసి సమాజ జీవనం కొనసాగిస్తుందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో సభ్యులు బుగ్గన విశ్వనాథరెడ్డి, పుల్లారెడ్డి, నాగేశ్వరరెడ్డి, శ్రీనివాసులు హిందువులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు

- వైద్యాధికారి ఇమ్రాన్



చాగలమర్రి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. తగు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వ్యాధులను నివారించవచ్చని పీహెచ్‌సీ వైద్యాధికారి ఇమ్రాన్ తెలిపారు. బుధవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ప్రశ్న: పీహెచ్‌సీలో ఓపీ ఎలా ఉంది?

జవాబు: ప్రతి రోజు 80 నుంచి 100 మంది వైద్యశాలకు అనారోగ్యంతో వస్తున్నారు. ఎక్కువగా కీళ్ల నొప్పులు, జలుబు, దగ్గుతో వస్తున్నారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి.

ప్రశ్న: సీజనల్ వ్యాధులు దేనివల్ల వస్తాయి?

జవాబు: తాగునీరు కలుషితం వల్ల జ్వరం, జలుబు, దగ్గు వంటి సీజనల్ వ్యాధులతో పాటు వైరల్ ఫీవర్ వస్తాయి. ఇవి రాకుండా వర్షాకాలంలో ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలి.

ప్రశ్న: సీజనల్ వ్యాధుల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటోంది?

జవాబు: పరిసరాలు, మురికి కుంటలు, నిల్వ నీటిలో లార్వా చేరకుండా వైద్య ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది సమన్వయంతో క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి షానిటేషన్, డ్రైడే, ఫ్రైడే కార్యక్రమాలు చేపడుతున్నాం. అలాగే దోమతెరలు వాడాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న: వైద్యశాలలో కాన్పులు జరుగుతున్నాయా?

జవాబు: వైద్యశాలలో ప్రతి నెల 6 నుంచి 7 కాన్పులు చేస్తున్నాం. వైద్య సిబ్బంది, అంగన్‌వాడీలచే గర్భిణులకు కాన్పుల విషయంపై అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న: సంచార చికిత్స పథకం కొనసాగుతోందా?

జవాబు: 13 సచివాలయాల పరిధిలో సంచార చికిత్స పథకం కొనసాగుతోంది. ప్రజలకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నాం.

ప్రశాంతంగా నాస్ పరీక్షలు

కొలిమిగుండ్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బెలుం, కొలిమిగుండ్ల, అల్ట్రాటెక్ ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం నిర్వహించిన నాస్(ఎన్ఏఎస్) పరీక్షలు ప్రశాంతగా నిర్వహించినట్లు మండల విద్యాధికారి అబ్దుల్‌కలాం తెలిపారు. పరీక్షా కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో 3, 6, 9వ తరగతికి చెందిన 120మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు తెలిపారు. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను గుర్తించడానికి ప్రభుత్వం పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో తెలిపారు. సీఆర్‌పీలు మద్దిలేటి, కమల, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

చాగలమర్రి: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకునేందుకే నేషనల్ అచ్యూవ్‌మెంట్ సర్వే (ఎన్ఏఎస్) పరీక్షలను ఆరు పాఠశాలల్లో నిర్వహించినట్లు ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల, తెలిపారు. చింతలచెరువు ఉన్నత పాఠశాల, చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పరీక్షలను పరిశీలించారు. ఈ పరీక్షకు 179 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు.

డెయిరీ ఎన్నికలు వాయిదా

చాగలమర్రి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నవంగలి గ్రామంలో పాల ఉత్పత్తిదారులు సహకార సంఘం ఎన్నికలు బుధవారం వాయిదా పడ్డాయి. సమస్యాత్మక గ్రామం కావడంతో ముందస్తుగా ఆళ్లగడ్డ రూరల్ సీఐ కంబగిరి రాముడు, ఎస్ఐ రమేష్‌రెడ్డి, దొర్నిపాడు ఎస్ఐ వెంకటేష్ ఆధ్వర్యంలో పాల కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. నామినేషన్‌లు స్వీకరించేందుకు ఎన్నికల అధికారిగా మైదుకూరుకు చెందిన చంద్రను నియమించారు. నామినేషన్‌లు స్వీకరించక ముందే ఎన్నికలు వాయిదా పడినట్లు నోటీసును ఏర్పాటు చేశారు. దీంతో నామినేషన్‌లు వేసేందుకు వచ్చిన వారు వెనుతిరిగి వెళ్లారు.

ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

శిరివెళ్ల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని ఎంఈవోలు డీటీ శంకర్ ప్రసాద్, నాగార్జునరెడ్డి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో భాగంగా చిన్నారులకు నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి శిరివెళ్లలోని భవిత కేంద్రంలో ఎంఈవోలు బుధవారం బహుమతులు పంపిణీ చేశారు. దివ్యాంగ పిల్లల విద్యాభివృద్ధికి ప్రభుత్వం భవిత కేంద్రాలతో పాటు ఫిజియోథెరపీ క్యాంపులను నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సహిత విద్య ఉపాధ్యాయులు మధుసూదన్‌రెడ్డి, పుష్పలత, హెచ్‌ఎం అక్తర్ ఉన్నిసా పాల్గొన్నారు.

ఉపాధి పనులు ప్రారంభించండి

రుద్రవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలో ఉపాధి హామీ పనులు ప్రారంభించాలని ఎంపీడీవో భాగ్యలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ డిసెంబరు 15 నాటికి 24 గోకులాలు పూర్తి చేయాలన్నారు. ఇప్పటి వరకు 19 గోకులాలు నిర్మాణంలో ఉన్నాయన్నారు. మొత్తం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి గ్రామంలో ఉపాధి పనులు కల్పించాలని ఆదేశించారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు ఉంటాయన్నారు.

ఆంజనేయస్వామి ఆలయ జీర్ణోద్ధరణ



ఆలయ నిర్మాణానికి పూజలు చేస్తున్న వేద పండితులు

చాగలమర్రి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని పాతబస్టాండు సమీపంలో పురాతన ఆంజనేయ స్వామి ఆలయానికి జీర్ణోద్ధరణ పనులు చేపట్టారు. బుధవారం వేద పండితుడు పెద్దశాస్త్రి, ఆలయ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జీర్ణోద్ధరణ పనులు ప్రారంభించా రు. రూ.18 లక్షలతో కొత్తగా ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు ఆలయ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దస్తగిరి, రాము తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగు లాభదాయకం

చాగలమర్రి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పండ్ల తోటల సాగు లాభదాయకమని హార్టికల్చర్ అధికారి రషీద్ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అయన మాట్లాడుతూ వర్షపు నీటిని వృథాగా పోనివ్వకుండా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, కోర్సు డైరెక్టర్ పరమేశ్వరుడు, ఏపీవో నిర్మల, టీఏ, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

అమర గాయకుడికి నివాళి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతి వేడుకలను పట్టణ ప్రజలు బుధవారం ఘనంగా నిర్వహించారు. లలిత కళా సమితి వ్యవస్థాపకుడు బిజ్జం వెంకటేశ్వరరెడ్డి సౌజన్యంతో పట్టణంలో ఘంటసాల చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత న్యాయాధికారి శివ ప్రసాద్, శ్రీనివాసరెడ్డి, బాలీశ్వరరెడ్డి, నరసయ్య, పుల్లయ్య, వివేకానంద, శంకరయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.